నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 24-7-2025

**గువ్వలు**

జీవితంలో
ఏ ప్రాణి నటించదు, జీవిస్తుంది
ఒక్క మనిసి తప్పా!

కూతురు అమెరికాలో..
కొడుకు లండన్‌లో..
భారతమాతా తల్లిదండ్రులది దీనస్థితి.

ఎదురైతే మాటల్లేవు
ఫోన్‌లోనైతే.. నిమిషాలకొద్ది
తెరమరుగవుతున్న మానవ సంబంధాలు

-జిందం అశోక్
సెల్:8978532225

**ఘంటారావం**

పదే పదే
పొగడుకోకు
పదిమందిలో
పలుచబడకు

విరులు రాలిపోయాయని
వృక్షం విలపించదు
గతాన్నే గుర్తు చేసుకుంటే
గుండె శాంతించదు.

జనం ఉంటేనే
ఊరు
జలం ఉంటేనే
ఏరు.

చీకటే లేకుంటే
రేపటికి వేటే
శోకమే లేకుంటే
సుఖాలకు చేటే.

చరిత్ర చెప్పింది
గుర్తుంచుకోదు
చేసింది

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## "అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారం"
# ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం ప్రతిష్టిస్తాం:మంత్రి జూపల్లి








దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని అన్నవరం దేవేందర్‌కు బహూకరిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్. చిత్రంలో దాశరథి కుమారుడు లక్ష్మణ్, కవి జయరాజ్, దాశరథి కుమార్తె ఇందిర, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా॥మామిడి హరికృష్ణ, కవి యాకూబ్, బాలాచారి తదితరులు.







తెలంగాణ వైతాళికుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టిస్తామని మంత్రి జూపలి కృష్ణారావు ప్రకటించారు. దీనిపై ఇప్పటికే హెచ్ఎండీఏకు లేఖ రాశామన్నారు. దాశరథి శత జయంతి ఉత్సవాలను మంగళశారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ జనజీవన చిత్రాన్ని ఆవిష్కరించిన కవి, కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఆయన్ని రూ. లక్ష నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించిన తర్వాత మంత్రి జూపల్లి మాట్లాడుతూ 'దాశరథి సాహిత్యాన్ని సాంస్కృతిక శాఖ ద్వారా రాష్ట్రంలోని 12 వేల గ్రామాల్లో అందుబాటులోకి తీసుకురాబోతున్నాం' అని ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో దాశరథి కవితలు, సాహిత్యం మాకెంతో స్ఫూర్తినిచ్చాయి' అని అన్నారు. పురస్కార గ్రహిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో భాష ఎంతో ముఖ్యం ఈ భాష సినిమాల్లో పాటల్లో విజయవంత మైంది. ఇకపై పాఠ్యాంశాల్లోనూ తీసుకురావాలి' అని మంత్రి జూపల్లిని కోరారు. సాంస్కృతిక శాఖ సంచాల కుడు డా॥ మామిడి హరికృష్ణ కవులు అందెశ్రీ, జయరాజ్, యాకూబ్, సా హిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, దాశరథి కుటుంబ సభ్యులు ఇందిర, లక్ష్మణ్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

**అన్నవరం గురించి...**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లో దశరథం, కేదారమ్మలకు అన్నవరం దేవేందర్ 1962 అక్టోబర్ 17 జన్మించారు.



సభలో ప్రసంగిస్తున్న దాశరథి అవార్డు గ్రహిత అన్నవరం దేవేందర్

ఆయన సతీమణి రాజేశ్వరి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆమె స్వయంగా కథా రచయిత్రి సోదరుడు శ్రీనివాస్ ప్రఖ్యాత చిత్రకారుడు, సోదరి నాంపల్లి సుజాత ప్రముఖ కవయిత్రి. పంచాయతీరాజ్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దేవేందర్ ప్రస్తుతం కరీంనగర్‌లో నివసిస్తున్నారు. 1985 నుంచి కొంతకాలం వివిధ దినపత్రికల్లో పాత్రికేయునిగా పనిచేశారు.

2015 నుంచి వివిధ పత్రికల్లో వ్యాసాలు రాస్తున్నారు. **తొవ్వ, నడక, మంకమ్మతోట లేబర్ అడ్డా, బొడ్డుమల్లె చెట్టు, పొద్దుపొ డుపు, పొక్కిలి వాకిళ్ల పులకరింత, బువ్వకుండ, ఇంటి దీపం, వరిగొలుసులు, గవాయి, జీవన తాత్పర్యం** వంటి కవితా సంపుటిలు రాశారు.

ఆంగ్లంలోనూ మూడు కవితా సంపుటిలు వెలువడ్డాయి.

**మరో కోణం** (సామాజిక వ్యాసాలు) **ఊరి దస్తూరి- 2020** (తెలంగాణ సాంస్కృతిక చిత్రణ, కాలమ్స్) **సంచారం** (యాత్రా వ్యాసాలు) **అంతరంగం** (వర్తమాన జీవన చిత్రణ) పుస్తకాలను రచించారు.

**'మంకమ్మతోట లేబర్ అడ్డా'** కవిత కాకతీయ వర్సిటీలో బీఏ స్పెషల్ తెలుగు విద్యార్థులకు పాఠంగా ఉంది.

దేవేందర్‌ను ఇప్పటివరకు వివిధ సంస్థల ద్వారా 21 పురస్కారాలు వరించాయి.



## సిద్దిపేటలో దాశరథి జీవితం-సాహిత్యం-ప్రేరణపై చర్చ



మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్య శతజయంతిని పురస్కారించుకొని సాహిత్యసమాలోచన కార్యక్రమంలో "దాశరథి జీవితం, సాహిత్యం-ప్రేరణలు'పై చర్చలో డా॥ నందిని సిధారెడ్డి పాల్గొని ప్రసంగిస్తున్న దృశ్యం.

## 'అగ్నిశిఖరం' పుస్తకాన్ని ఆవిష్కరించిన కె. శ్రీనివాస్




'అగ్నిశిఖరం' పుస్తకాన్ని ఆవిష్కరించిన కె.శ్రీనివాస్. వేదికపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, వజ్జుల శివకుమార్, హరగోపాల్, డా॥నాళేశ్వరం శంకరం, దాశరథి కుమారుడు లక్ష్మణ్, అమ్మంగి వేణుగోపాల్, తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం అధ్యక్షుడు కాంచనపల్లి, ఘనపురం దేవేందర్ తదితరులు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో జాతీయ పార్టీలు భాజపా, కాంగ్రెస్ మోసం చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలుగు వర్సిటీలోని ఎన్టీఆర్ కళా మందిరంలో జాగృతి ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కవిత అధ్యక్షోపన్యాసం చేస్తూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై శాసనసభ, మండలిలో ఆమోదించి డిల్లీకి పంపిస్తే.. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో పెట్టి, మతపరమైన రంగుపులిమేయత్నం భాజపా చేస్తోందన్నారు.తెలంగాణలో ఓట్లు రావని తెలిసే బిల్లును భాజపా అడ్డుకుంటోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఫ్లయిట్‌మోడ్ సీఎం అయ్యారని, ఇప్పటికే 50 సార్లు డిల్లీ వెళ్లి వచ్చారని, ఒక్కసారీ బీసీ రిజర్వే షన్ల విషయంలో ప్రధానిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయలేదన్నారు. దాశరథి వందేళ్ల జయంతిని నిర్వ హించాలని గతేడాది నుంచి జాగృతి ప్రభుత్వాన్ని కోరుతోంది. ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలు ఏమీ చేయడం లేదనే.. జాగృతి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్ 'అగ్నిశిఖరం' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనాచారి, కవి, సాహితీవేత్తలు, తెరసం అధ్యక్షుడు డా॥నాళేశ్వరం శంకరం, డా॥ అమ్మంగి వేణుగోపాల్, దాశరథి కుమారుడు లక్ష్మణ్, తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం అధ్యక్షుడు కాంచనపల్లి , పరిశోధకుడు హరగోపాల్, వజ్జుల శివకుమార్ తదితరులున్నారు పాల్గొన్నారు. 'అగ్నిశిఖరం' కవి సమ్మేళనం నిర్వహించారు.

## దాశరథి సాహిత్యం తెలుగు భాషకు కోటి రతనాల వీణ



డా॥కసిరెడ్డి వెంకటరెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ కె.వి.రమణాచారి, కిన్నెర రఘురాం తదితరులు.

దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం తెలుగు భాషకు కోటి రతనాల వీణ అని ప్రముఖులు అన్నారు కిన్నెర ఆర్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో డా॥దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకల సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకుడు డా॥కసిరెడ్డి వెంకటరెడ్డికి కిన్నెర దాశరథి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్, పురస్కారం బహూకరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవులు ఎందరో ఉన్నారని దాశరథి సాహిత్యం నిజాం నవాబుపై ధిక్కారస్వరంగా మారిందని అన్నారు. అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కే.వి.రమణాచారి మాట్లాడుతూ కసిరెడ్డి వెంకటరెడ్డి ఆధునిక కాలం వివేకానందుడు అన్నారు. ఆయన దేశభక్తి జాతీయ భావం ప్రశంసనీయం అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ టి. ఉదయవర్లు, దాశరథి కుమార్తె ఇందిర, రచయిత ప్రభాకర్ తమ అభినందనలు తెలిపారు. కిన్నెర రఘురామ్, బాల కామేశ్వరరావు, డా॥నాగేశ్వరరావు, సురేఖ, వీఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత దాశరథి గీతాలను గాయనీగాయకులు ఆలపించారు.



తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్యదర్శి డా॥నామోజు బాలాచారి, సమ్మెట విజయ, పి.బడేసాబ్, రామకృష్ణ చంద్రమౌళి.

## నిరంకుశ పాలనపై ధిక్కార స్వరం దాశరథి కవిత్వం
### -హాస్య అవధాని శంకర నారాయణ వ్యాఖ్య



సభలో ప్రసంగిస్తున్న శంకర నారాయణ. వేదికపై చింతలపూడి త్రినాథరావు, కళా జనార్ధనమూర్తి తదితరులు

అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం వంటి కవితా సంపుటిలలో దాశరథి కృష్ణమాచార్య దీన ప్రజలపై ఆవేదన, నిరంకుశ పాలనపై ఆవేశం వ్యక్తమవుతాయని సీనియర్ జర్నలిస్ట్, హాస్య అవధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ప్రఖ్యాత కవి దాశరథి కృష్ణమాచార్య యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర నారాయణ మాట్లాడుతూ నాటి రాచరిక పాలనలో ప్రజలపై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరంగా కవిత్వాన్ని మార్చినవారు దాశరథి కృష్ణమాచార్య అని చెప్పారు. ఆయన కవిత్వాన్ని కేవలం సాహిత్యపరంగా కాకుండా ఉద్యమ భాషగా ఉపయోగించారని వివరించారు. సినీ పాటల్లో కూడా దాశరథి సామాజిక చింతన వ్యక్తమవుతుందన్నారు. గాయకులు చింతలపూడి త్రినాథరావు, సంఘసేవకుడు వి. వెంకటరావు, పత్రికా రచయిత లక్ష్మీశాంతి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## దాశరథి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి-ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణకు దాశరథి కృష్ణమాచార్య అత్యంత ఆప్తుడని ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేవపతి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ పేద ప్రజల ఆర్తియే ఆయన కవితకు చమురని చెప్పారు. కవిత్వంలో తెలంగాణ తల్లి భావనకు ప్రాణప్రతిష్ట చేసిన ఘనత దాశరథికే దక్కుతుందని కొనియాడారు. దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి



సభలో ప్రసంగిస్తున్న దేశపతి శ్రీనివాస్

ముఖ్య అతిథిగా దేవపతి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. దాశరథి అక్షరాల నిండా.. పేద ప్రజల ఆర్తి నిండి ఉందని అన్నారు. వర్తమాన కల్లోల సమాజాన్ని తన రచనల్లో వ్యాఖ్యానించి ప్రజల నాలుకలపై నిలిచిన ప్రజాకవి దాశరథి అని కీర్తించారు. కవిగా, రచయితగా, నిజాం వ్యతిరేక ఉద్యమకారుడిగా సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. తెలుగు, ఉర్దూ, సంస్కృతం వంటి భాషల్లో ప్రావీణ్యం కలిగి, ప్రజాఉద్యమాలలోనే కాకుండా సినీ గేయ కవిత్వంలో సైతం 2500కు పైగా గీతాలను రచించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని అన్నారు. దాశరథి ఆశయాలను యువతరమే ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ సుందర భవిష్యత్తును నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశి, ప్రొపెసర్ సాగి కమలాకర శర్మ, తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రఘు, డాక్టర్ మహేందర్, డాక్టర్॥ చంద్రయ్య, డాక్టర్ నరేందర్, పరిశోధక విద్యార్థులు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.




ఖమ్మం ఈస్తటిక్స్, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో మంగళవారం ఖమ్మం జెడ్.పి. మీటింగ్ హాలులో దాశరథి శతజయంతి కార్యక్రమంలో పాల్గొన్న కవి పోతగాని, రవిమారుత్, ఐ.వి.రమణారావు, సీతారాం, ప్రసేన్, వంశీకృష్ణ, కన్నెగంటి దేవయ్య, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



ఈ వారం అంశం: రాజధాని రైతులు
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో
డా॥రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. 2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 22 కు మొత్తం 20 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 5 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

## వచన కవితలు

### ఓ రైతన్న!

దివరాత్రులు కంటికి రెప్పలా
కటిక కాపరిలా
కాపలా కాసే రైతన్నా!
ఉదయించే సూర్యుడవై
నీ పంట భూములను
రాజధానికై అర్పించిన నీ త్యాగం
అమరం అమరం...
నీ కష్టం అనంత విశ్వసృష్టికే
తీరని రుణం ,
బక్క చిక్కిన పొట్టతో
బువ్వకు కరువైనా సరే
ఊపిరి బిగ పట్టుకొని
నీ పంట భూములను
రాజధానికై అర్పించిన నీత్యాగం
అమరం అమరం...
గుండె నిండా వేదన ఎగజిమ్ముతున్నా
టన్నుల కొద్ది దరిద్రం వెంటపడుతున్నా
కేజీల కొద్ది నిరాదరణ కరువైనా సరే
నీ పంట భూములను
రాజధానికై అర్పించిన నీ త్యాగం
అమరం అమరం ..
సర్వకోటి ప్రాణుల యందు
దయ తలచి కారణజన్ముడవై
దివ్యకార్యం నెరవేర్చేందుకు
అవతార మెత్తిన అపర భగీరథుడవై
నీ పంట భూములను
రాజధానికై అర్పించిన నీ త్యాగం
అమరం అమరం ...
మాడు చెక్కలే పరమాన్నంలా తింటూ
చెరువు నీళ్లే అమృతంలాగా తాగుతూ
చెరగని చిరునవ్వుతో
రారాజులా బతుకీడుస్తూ
నీ పంట భూములను
రాజధానికే అర్పించిన నీ త్యాగం
అమరం అమరం...

-సత్యవతి
(కరాలపాడు, పల్నాడు)

### త్యాగాలతో గాయాలు

ఎన్నో గ్రామాలు..
ఎందరో రైతులు..
పసిడి భూములను దానం ఇచ్చి
తమ కలల పంటను
పండించుకోవాలనుకున్నారు
ఎన్నో ఆశలు...
వాటిని పెనవేసుకున్న మరెన్నో శ్వాసలు
ఎన్నో ఉద్వేగాలు..
మరెన్నో భావోద్వేగాల మధ్య
మూడు రాజధానుల ముప్పేట దాడిలో
ముసురుకున్న కష్టాల వాన
అయినా.. త్యాగాల గాయాలతో
రాజధాని నిర్మాణానికి
రాళ్ళు ఎత్తిన కూలీలయ్యారు వారంతా
కరిమబ్బులు తొలగిపోయాయి
పున్నమి చంద్రుని వెండి వెన్నెల్లో
ఇప్పుడు అక్కడ
రాజధాని నిర్మితమవుతుంది
ఆంధ్రుల ఆత్మాభిమానం
తలెత్తుకుని తిరిగేలా..

-జాగరాపు శంకరరావు

### రాజధాని 'రైలుబండి' కదిలొస్తోంది...!

'అన్నదమ్ము'లై...
'ఐకమత్యం'తో జీవిస్తున్న
'తెలుగు' ప్రజల మధ్యన
అసమానతల 'చిచ్చు'ను రగిల్చీ...
'అన్నపూర్ణ'గా పేరుగాంచీ...
ప్రేమానురాగాలు తొణికిసలాడే...
నిండుకుండ వంటి
అవిభాజ్య 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రాన్ని...
'రెండు' ముక్కలుగా పనిగట్టుకుని చీల్చీ...
తన 'పంతం' నెగ్గించుకున్నానని
తెగ మురిసిపోయింది...
'రాజకీయ' స్వార్థాన్ని పులుముకున్న
నాటి 'రాజ్యాధికారం'...!
తత్ఫలితంగా...
'అమ్మ' ఒడిలోంచి వేరుపడ్డ...
నవజాత 'శిశువు'లాంటి...
రాజధాని లేని 'నవ్యాంధ్ర' రాష్ట్రాన్ని...
నిండు గుండెతో 'అక్కున'జేర్చుకుని...
ముప్పొద్దులా 'మెతుకు' పెట్టి బ్రతుకు నిచ్చే...
వేల ఎకరాల 'పంటభూము'ల్ని
స్వచ్ఛందంగా 'దాన'మిచ్చీ...
'అమరావతి నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ'లై
ఉప్పెనలా కదిలొచ్చిన...
రాజధాని రైతుల 'త్యాగనిరతి'ని కొలిచేందుకు...
ఒక జీవితకాలం సరిపోదు...!!
అటు పిమ్మట 'కాలం' కన్నెర్ర జేసీ...
'మూడు ముక్క'లాటకు తెర తీసీ...
భూము లిచ్చారన్న 'అక్కసు'తో...
అభం శుభం ఎరుగని
'అన్నదాత'ల్ని నడిరోడ్డుకీడ్చినా...!
అక్రమ కేసులు బనాయించి '
అవమానా'ల పాల్జేసినా...!
కటకటాల వెనక్కు త్రోసి కసిదీరా హింసించినా...
'ఆత్మస్థయిర్యా'న్ని కోల్పోక...
అందరొక్కటై 'ఐకమత్యము'న ఉద్యమించీ...
ప్రాణాలొడ్డి పోరాడి 'పునర్జన్మ'నిచ్చీ...
'అమరావతి'ని కాపాడుకున్న...
'భూమిపుత్రు'ల మొక్కవోని ధైర్యసాహసాలను...
వేనోళ్ళ పొగడినా తక్కువే సుమా...!
'కాలం' కరుణించీ...
'చీకటి' రోజుల్లో 'వేకువ' పొద్దు పొడిచింది!
'మానవత్వం' పరిమళించీ...
రాజధాని 'పునర్నిర్మాణా'నికి 'దిశానిర్దేశం' చేస్తూ...
'రైతే రాజు'యి పరిపాలించే '
మంచిరోజు'లకు పునాదివేసింది!.
ప్రజలూ, పాలకుల 'సమిష్టి' కృషి ఫలితంగా...
'పెట్టుబడు'ల పచ్చజెండాను ఊపుకుంటూ...
'అభివృద్ధి-సంక్షేమ'పు జోడుపట్టాలపై
పరుగులు తీస్తూ...
'ప్రగతి' స్టేషన్లను పలకరిస్తూ...
శరవేగంగా దూసుకొస్తోంది....
'వందే భారత'మని నినదిస్తూ...
మన అమరావతి 'రైలు బండి'...!.
హారతిద్దాం పదండి...!
ఆంధ్రుల 'కల'ల రాజధాని అమరావతి 'రైలుబండి'కి...!
మిన్నంటే 'కరతాళ'ధ్వనుల సాక్షిగా...!
'స్వర్ణాంధ్ర' సాధనే మనముందున్న ఏకైక 'లక్ష్యం'గా....!!

-రాయపురెడ్డి సత్యనారాయణ

పసిడి పైరు దీపాలను చిదిమేసుకుని
ఆంధ్రుల ఆశా దీపాలను వెలిగించేందుకు
అపర బలి చక్రవర్తులుగా మారిన
ఓ రైతన్నల్లారా జయహో.
రాజకీయ చట్రం లో నలిగిపోతున్నా
అక్రమ కేసుల బనాయింపులకు బలవుతున్నా
వెనుతిరగని సైనిక యోధులుగా మారిన
ఓ రైతన్నల్లారా జయహో.
రాజధాని అమరమై వెలగాలని
సమరానికైనా సై అంటూ,
కన్నీటి కథలను కంటిపాప వెనుక దాచేస్తూ
విరిగిన రెక్కతో పోరాడే జాటాయువుల్లా మారిన
ఓ రైతన్నల్లారా జయహో.
పాలకుల భావోద్వేగాలకు బలి పశువులవుతూ
అనుబంధాల్ని అణిచేసుకుని లక్ష్మణరేఖలో బందీలై
మట్టితో బంధానికే విలువన్న అన్నదాతలైన
ఓ రైతన్నల్లారా జయహో.
జగన్నాటకంలో నాడు రాహువు నోట బడ్డ రాజధాని
నేడు పున్నమి చంద్రుడిలా వెలగబోతుందిలే
ఈ పరంపరలో భగీరథులుగా మారిన
ఓ రైతన్నల్లారా జయహో.
రాజధాని కలల సౌధాలకు పునాదులు మీరు
కలికాలపు శిబి చక్రవర్తులైనారు మీరు
కలకాలం దేశచరితలో నిలిచే అమరవీరులూ మీరే
జయహో రైతన్నల్లారా జయహో.

-మేడిశెట్టి సుభద్రా కృష్ణ, గుంటూరు

### రాజధాని రైతులు

కొందరు
రాజకీయ నిరుద్యోగుల
మదిలో మెదిలిన
'సెపరేటిజం' అనే విష బీజం.
యుద్ధం లో ఓడిన దేశాన్ని
'బెర్లిన్ గోడ' కట్టి
మరీ పంచుకున్న
మిత్రదేశాల లాగా ?
పార్లమెంట్ సాక్షి గా
'అధికార' 'అనధికార' పక్షాలు
చేతులు కలిపి
తమ 'తలపుల'
తలుపులు' మూసివేసి
అభివృద్ధి 'వెలుగు'లు చిమ్ముతున్న
తెలుగు జాతి' ని విభజించి,
నిర్మించిన అడ్డుగోడ?.
వికాసానికి
'సడన్ బ్రేక్' పడిపోయి
విడిపోయి?
రోడ్డున పడిన పెద్దన్న?
దిక్కుతోచని జనం..
విభజన వీరుల వికటాట్ట హాసం..
"అంత పొడవున్న
తీర ప్రాంతం
మీకే స్వంతం"అంటూ
'పుండుపై ఎర్రటి గుంటూరు కారం'
చల్లుతున్న
దుష్ట ఆత్మలను
'ఓట్ల' కర్రలతో
పొలిమేరల ఆవలకు పారద్రోలి
'ప్రగతికే పట్టం' అన్నారు జనం.
సరిగ్గా అప్పుడు!!
'విధ్వంసం'నుండి
'వికాసపు'దారి వెతుక్కుంటూ
మెరిసిన ఒక వినూత్న ఆలోచన!!
దానిని సాకారం చేయడానికి
'భూ'త్యాగాలకు సిద్ధపడ్డ రైతులు!!
చరిత్రలోనే మొదటగా ప్రజలనే
భాగస్వాములుగా చేసే
కొత్త ఆర్థిక నిర్మాణానికి శ్రీకారం!!
ప్రజల 'ఆశలు','ఆకాంక్షలు' అనే
విత్తనాలను
తమ భూముల్లో నాటి
'వికాసపు' వృక్షాలను
చిగురింప జేసి..
'భవ్యమైన భవిష్యత్తు' అనే
'పంట' ను పండించడానికి
వర్తమానాన్ని వదులుకున్నారు
'ఘన' ధీరులైన
మన 'రాజధాని రైతులు'..
'ముప్పైవేల' ఎకరాలు
'మూడు' పంటలు..
ఆహారభద్రతను కోల్పోతున్నా మని
పదే పదే వల్లె వేస్తున్న
'నిరర్థక' నిరోధకులూ!
పెంచుకోవద్దు దీనిపై కక్ష!
ఇది ' కోట్ల 'మంది కి
కడుపులు నింపబోయే
భవ్య సంకల్ప దీక్ష!!
నవ్య'నవ' నగరాల సాకారం కోసం
సహకరిస్తున్న
రాజధాని రైతన్నల ఎడల వలదు
వివక్ష !.
వారు నేడు చేస్తున్న త్యాగమే
రేపటి అభ్యున్నతికి శ్రీరామ రక్ష!

-శ్రీనివాస శాస్త్రి

## భూమిపుత్రుడా నీకు వందనం



పుడమి తల్లినే దైవంగా
పంట పొలాలనే ప్రాణంగా
పలుగుపారలనే ఆయుధాలుగా
పశువులనే సైన్యంగా
వాన చినుకులనే ఆశగా
నీ వెన్నునే హలముగా
జేసుకుని మట్టితోనే కడవరకు స్నేహం చేసే
ఓ భూమి పుత్రుడా నీకు వందనం!
కోడి కూయక ముందే నిద్రలేచి
పంటకు సమయానికి నీరుపెడుతూ
కంటిపాపలా పంటను నిరంతరం కాపాడుకుంటూ
మూటకట్టిన చద్దన్నం తింటూ
మూగజీవాలనే సోపతులుగా చేసుకుంటూ
మట్టి తల్లి ఒడిలో సేదతీరుతూ
ఈ ప్రపంచాన్ని నీ శ్రమతో బ్రతికించే
ఓ భూమి పుత్రుడా నీకు వందనం!
ఇంటికి దీపం ఇల్లాలు అయితే
ఈ లోకానికే దీపం నీవు
పలువరుసలలో పైరు పంటలను సృష్టించే
ఓ ఇంజనీరు నీవు
నీ కన్నీళ్లతోనే నేలను తడిపే కర్షకుడివి నీవు
నీ చెమటనే సేద్యంగా మార్చి
లోకం ఆకలితీర్చే అన్నదాతవి నీవు!
కరువు కష్టంగా కదిలించిన
కరెంటు కోతలు కత్తిలా దిగిన
పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోయినా
అప్పులు ముప్పుగా మారిన
దళారీ వ్యవస్థ నీ చెమటను ధనదాహంలా తాగిన
దేశాన్ని బ్రతికించడం కోసం దేహం అలసిపోయిన
కట్టుకున్న భార్య పుస్తెలమ్మి మరి
సమస్త మానవాళిని బ్రతికిస్తున్న
ఓ భూమిపుత్రుడా నీకు పాదాభివందనం!
బ్రతుకు భారమైన మెతుకు వ్యాపారమైన
నీవు చేసే అలుపెరగని పోరాటం
ఈ దేశానికి గర్వకారణం
ఏమిచ్చినా నీ రుణం తీర్చుకోలేదు ఈ సమాజం!
బురదనే బంగారం అని నమ్ముకుని జీవించే
ఓ భూమిపుత్రుడా నీకు శిరసాభివందనం..

-నందిని గోపు.
6302398650



# దాశరథి అమృతాభిషేకం- ఒక సమాలోచన



-డా.శ్రీభాష్యం అనూరాధ
తెలుగు అధ్యాపకులు
తె.సాం.సం.గు.మహిళా
డిగ్రీ కళాశాల, మహేంద్రహిల్స్.

తెలంగాణలో పుట్టి,తెలంగాణ కోసం అంకిత భావంతో కృషిచేసి,అనారోగ్యం వేధిస్తున్న, లాఠీదెబ్బలు బాధిస్తున్నా, తుదిశ్వాస వరకు తెలంగాణ నినాదాన్ని వదలకుండా జీవించిన వ్యక్తి 'దాశరథి కృష్ణమాచార్య'. తండ్రి చాంధసుడైనా అడ్డంకులన్నింటినీ దాటుకుంటూ అప్పటి రాచరిక వ్యవస్థను నిర్భయంగా ఎదిరించారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్న ఆయన మాట నిజామాబాద్ జైలు గోడలు దాటి బయటి ప్రపంచాన్ని చైతన్య పరచి విశ్వవ్యాప్తమైంది.

తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలచి, నిజాంపాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని, తెలంగాణ కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. వీరు 1925 జూలై 22న వరంగల్ జిల్లా గూడూరులో జన్మించారు.

నిజాం నవాబు దురాగతాలకు చలించిన దాశరథి ఆకలితో అలమటించే నిరుపేదల్ని గురించి 'రుద్రవీణ' మీటి,విప్లవ గీతాలను పలికింది. తెలంగాణ విముక్తి పొందిన తర్వాత కోటి తెలంగాణ తమ్ములను 'మహాంధ్రోదయం' పేరిట కోట్ల ఆంధ్రన్నలతో ముడివేసి సౌభాగ్యగీతిని ఆలపించాడు. తరువాత తెలుగు తల్లికి 'అమృతాభిషేకం' చేసి పునీతుడయ్యాడు.

పదహారు కవితలతో(కళలతో) అమృత ప్రవాహంలా అక్షరసుధలు కురిపించింది. 'అమృతాభిషేకం'. ప్రకృతికే 'సుప్రభాతం' పలకడంతో ఈ కావ్యం ప్రారంభమవు తుంది. ఈ సుప్రభాత కారకుడు సూర్యుడు. ఆ భానుదు ఆరోగ్య ప్రధాత అని..

**దైహికారోగ్యమునే గాక తన కరాల**
**హృదయ మందలి రుజ నెల్ల వదలగొట్టి**
**ఆత్మకానందమును కూర్చునట్టి వైద్యు**
**డతని కభివాద మొనరింతు నంజలింతు'**

భూనివమ్ములకు వెలుగుపువ్వులు పూయించే వాడుగా, లోకాల చీకట్లు తొలగించి, మానవుల హృదయాల తమోగుణమును దూరం చేసేవాడుగా, కనురెప్పల దుప్పట్లను తొలగించి, వెలుగులోకాల తలుపులను తీయువాడుగా వర్ణించాడు. ఎన్నో భావనా భంగిమలతో సూర్యుణ్ణి వర్ణించి, ముగింపులో ప్రకృతికాంతను ఇలా మేల్కొల్పుతాడు?

ఇంక నిద్దుర పోయేదవేమె, సుధతి!
ఇరులె కురులయి పడి మొగమెత్తనీక
బరువుగా నిన్ను నిద్రతో బాధపెట్టు
తొలగద్రోచితి లెమ్ము మత్తు, విడిరమ్ము?

'అమృతాభిషేకం'లో భావనా జ్యోత్స్న వెలుగులను కురిపించాడు దాశరథి.

అతడు తొంగి చూచినపుడెల్ల అమృత పా
తమ్ము జరుగు, యౌవనమ్ము పెరుగు
**కలతలెల్ల తరుగు, కవితాసరస్వతీ**
**మృధు పదాలు నాల్కమీద తిరుగు..**

**విజ్ఞానశాస్త్ర వికాసానికి, కవిత్వ భావుకతకు జరిగే సంఘర్షణను**

**"నాపై దాడి యొనర్ప చూచెదరు బాణవ్రాతముల్ చిమ్మి" అని అంటారు.**

**నాపని అయిపోయినదిక**
**ఆపై సూర్యునికి గూడ ఆపదవచ్చెన్**
**రేపో మాపో దివిపై**
**కాపురముండెదరు మనుజ గణములు మిత్రా?**

**గగనతలంలో విహరించడమనే** జాగృత వ్యవస్థలో జరగబోయే పరిస్థితులను హెచ్చరించారు ఈ కవితలో..



దాశరథి 'అమృతాభిషేకం' లో నాకు నచ్చిన శీర్షిక 'తామసి'. దీనిలో వెలుగు,చీకట్లను -జ్ఞాన,అజ్ఞానాలతో పోలుస్తారు. పూర్వకవులు కొందరు చీకట్లను కబరీభరంతో పోల్చారు. దాశరథి చీకట్లు ఆకాశంలో ఎలా వ్యాపిస్తాయో, ఎక్కడ స్థావరంగా మారుతాయో, ప్రకృతిలో ఎక్కడెక్కడ కనిపిస్తాయో, శబ్ద భావాలతో చక్కటి వర్ణనలతో అభివర్ణిస్తాడు.

**ఇరులె కురులయి,ఝరులయి పరుగులెత్తి**
**ఇరులె కరులయి, హరులయి ఇంపు నింపి**
**ఇరులె విరులయి,సరులయి ధరణి నిండి**
**ఇరులె నరులకు మరులు కల్పించుగాత?**

అంతేకాదు ఇరుల అందము ఎక్కడ కానరాదంటూనే, 'ఇరులు లేకపోతే నరులు కానగరారు -నరులు లేనినాడు ధరణి లేద'ని నర్మగర్భంగా తేల్చి చెప్పాడు.మహాయోగులు మాత్రమే చీకటిని ప్రేమించగలరు..

"దీపాంగన, చీకటినటి, చేతనాజ్యోతి" కవితల్లో పారసీ, ఉర్దూ వేదాంతాల ప్రభావం కనబడుతుంది. దాశరథి ఉర్దూ, పర్షియన్ భాషలు తెలిసినవాడు కాబట్టి, వాటి కవిత్వాల రసజ్ఞతలను అనుభవించి, వాటి సాంప్రదాయాలు వారి కవిత్వంలో అలవోకగా కలిసిపోయాయి.

'ఆశాసౌధం'లో? నా ఆశాసౌధం గోడలు నరులే !దానవులు కారు; నా ఆశా సౌధం నీడలు నావే! నరపతులవి కావు' అంటూ తనను తానే ఆశావహదృక్పథంతో మలుచుకుంటాడు.

'మహాంధ్రీ' లో తెలుగుతనాన్ని, తెలుగుదనాన్ని, తెలుగు స్థలాల్ని సృజించి గొప్ప భావంతో తెలిపాడు. 'అడుగడుగు నందు నందనోద్యాన మొలయ, అంగుళ మ్మంగుళమ్ము పుణ్యస్థలముగా వెలయ, తెల్గునేల సింగార మొప్పు, తెల్గుదన మొల్కవే దశదిశలలోన' అంటూ?? ఆశాపూరితుడై ప్రపంచాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాడు. మహాన్ద్రోదయాన్ని కాంక్షిస్తాడు.

'వాగ్వజ్రం' ఖండికలో 'లంకగా కాక కైలాసముగా జగము రాణించినటు పునారచన చేతము రమ్మని' ఆహ్వానిస్తాడు. మనిషి మనిషిలా ఉండాలి, పేద-గొప్ప, మత తారతమ్యాలు మానాలని 'మధ్య ప్రాచ్య మహాయజ్ఞం' అనే ఖండికలో చెబుతాడు.

"ఓపిక" రూపం దిద్దుక
ఉరికి వచ్చు నతనిలో
"శాంతి" శరీరమ్ము బూని
సాగివచ్చు నతనితో?. అంటూ

అభ్యుదయ శాంతికాముకతో గాంధీజీని తన కవితా సుమాలతో అర్చించాడు(ఎవరి పాద చిహ్నములివి?-ఖండిక).

"మహాంద్రామృతం"లో భావనా చైతన్యశీలత కనిపిస్తుంది. ఆధ్యాత్మిక చింతనతో విశ్వమాతను కీర్తిస్తాడు.

'విస్మృతి పాన పాత్ర'లో దాశరథి -విశ్వమాత తల్లి అయినచో తాను పుత్రుడుగాను, అక్క అయినచో తమ్ముడుగాను, వదిన అయినచో చిన్న మరిదిగాను ఉండగోరుతాడు. నిర్మలత్వంతో కూడిన గౌరవ జీవనమే వారి ఆకాంక్ష.

"మాతృదీప్తి, వధూనికా మధుర కప్తి, సోదరీత్వ పరివ్యాప్తి పాదుకొనిన" అన్నమాటలో దాశరథి కవి జీవిత కమలం వికసించడానికి, వారి వదిన గారి 'అమృత' సన్నిధి నిలిచింది. 'వధూనిక' కవిత అంతరించిపోతున్న భారతీయ కుటుంబ జీవన విధానం ఎంత గొప్పదో తెలియ చేస్తుంది?. అన్నపూర్ణవై నీ వింటనున్న యపుడు తిండికై తిరిపెమ్మెత్తి తిరగనేల?. అని అంటారు.

**"వేప పూవులలో చేదు విరిగిపోవ**
**రసనపై తీయ మాటలు విసర వలయు**
**ఉదయమే లేని గాఢాంధ హృదయ మందు**
**చిత్ర భాను నూనము వికసించవలయు?..** అంటూ 'చిత్రభాను' ఉగాదికి దాశరథి చేసిన అమృతాభిషేకానికి అందరూ పరవశులై రసస్రవంతిలో విహరించవలసిందే. ఆ అమృతాభిషేకంలో పరవశింప వలసిందే.

కవిత్వం జాలువారే ప్రవాహం అది. కొత్త ఒరవడితో, పదబంధాలతో ఆకర్షించే ఆణిముత్యాలు వారి కవితా దారలు. స్నేహ వారధిలా ఉంటూ అనేక పద్య ప్రయోగా లను చేస్తూ, పద్యకవిగా వామనావతారానికి ప్రతిరూపుగా, అమేయ రచనా కృతులను చేస్తూ విశ్వరూప ప్రదర్శన గావించినవారు మహాకవి దాశరథి. ●

# ఆ మంగలి శిల్పి ఔదార్యం - ప్రపంచానికి ఆదర్శం



-డా॥ కత్తి పద్మారావు
9849741695

నోబుల్ మేధావులు పుట్టిన నేల
శాస్త్ర జ్ఞానాన్ని
ప్రపంచానికి అందించిన నేల
ప్రవక్తలు, జ్ఞానులు పుట్టిన నేల నుండి
విధ్వంసకాండ జరుగుతుంది
పాలస్తీనా, ఇరాన్, లెబనాన్,
సిరియా దాయద దేశాలపై
అమానుష దాడులు ప్రతి దాడులు
ప్రేమ పంచిన పవిత్ర గ్రంథాలు
అక్కడ పుట్టాయి
శాంతి బహుమతులు పొందినవారు
అక్కడే జనించారు
కానీ! నేడు అది
అగ్నిగుండమయ్యింది
వారే మళ్ళీ ఆలోచించాలి
అవును! అలెగ్జాండర్
ప్రపంచమంతా జయించాడు
సమాధి పెట్టెలో నుండి చేతులు
బయటకు చాచాడు
మేధావులు, తాత్వికులు
ఈ ప్రపంచాన్ని విస్తరింపజేశారు
లిప్తమాత్రం అడిగితే ఇవ్వనివారు
ప్రకృతి నుండి నేర్చుకోవాలి
అనేక అటుపోటులు ఉంటేనే కదలికి ఉత్సాహం
మనిషి అంతే!
నిశ్చలమైన సరస్సుల్లో నాచు ఎక్కువ
నీ మనస్సులో మరొకరికి
అభిప్రాయానికి చోటునివ్వు
నీ ఆలోచనలతోనే నిండిపోతే
కుండ నిండాక పొర్లడమే ఉంటుంది
గాలిని శ్వాసగా మార్చడమే ప్రక్రియ
దానికి నిశ్చలత, నిబ్బరం అవసరం
నీవు నిన్నలో అన్ని వెదకవద్దు
ఈ రోజును అనుభవిస్తే
వీచే గాలి తాగే నీళ్ళు
నీకు అనుభూతం అవుతాయి
మనుషులు బిజీగా వున్నారు
దేని కోసం అనే అన్వేషణను
కొలవలేము?
స్థిరత్వాన్ని సాధించడంతోనే అభివృద్ధి
వారసత్వాన్ని రక్షించడానికి
ఉన్నది పెంచడానికి కొందరు
లేని దాని కోసం ఆరాటం మరికొందరిది
నీ శక్తిని అంచనా వేసి మెరుగు పెట్టుకో
నది ప్రవహించే దగ్గర
కొండ కూడా రాపిడికి గురవుతుంది
అది మొదట కొండ
తరువాత శిల్పం అయ్యింది
అక్షరం క్షయం కానిది
56 అక్షరాలతో
అనంత వాఙ్మయ సృష్టి
అక్షర సృష్టికి విదూరులు
మాట్లాడే బ్రతకడం వల్ల
కొయిల్లాగా కూసి
మరణించినట్లు అవుతుంది
అక్షరం రాని వాడు
ఊహ చిత్రాలను
ఊహల్లో మాత్రమే చిత్రిస్తాడు
అవి వాయువులో కలిసిపోతుంది
అక్షరాలలో చాలా చిత్రాలు
లిపి సమాజాన్ని మార్చింది
కేవల ధారణ వలన
బుద్ధి కౌశలత పెరగదు
అర్థ గాంభీర్యత వివేచన
చారిత్రక అవగాహన సామాజిక స్పృహ
మానవ జీవన సంఘర్షణ
మనిషిని తీర్చిదిద్దుతుంది
ఆ జాలరి సముద్రం
అలల మీద రాసిన రాతల్లో
ఎంతో ప్రకృతి సంపద దాగి వుంది
అక్షరం రాయని చక్రవర్తులు
నియంతలయ్యారు
కత్తి ఒకనాడు ఉత్పత్తి పరికరం
క్షత్రియత్వం
మానవ వధకు దాన్ని ఉపయుక్తం చేసింది
ఆ మంగలి కత్తి
ఎప్పుడు శిల్పాలు చెక్కే ఉలి వంటిదే
అతని ఔదర్యం దేశానికి ఆదర్శం
హిట్లర్ కంటే మంగలి గొప్పవాడని
చాప్లిన్ చెప్పలేదా!
మంచి మాట కోసం జీవించండి
మానవత్వ పరిమళాలు వెదజల్లండి
మానవతా మూర్తులు
ఆకాశ నక్షత్రాలై వెలుగుతారు
యుద్ధం వినాశనానికి గుర్తు
శాంతి కోసం ఆరాటపడండి
విధ్వంసం ఎక్కడ జరిగిన
అక్కడ మరణించేది మానవులే
ఇజ్రాయేల్, ఇరాన్ యుద్ధం
ప్రపంచానికి ముప్పు
మరొకరికి ఆయుధం
మరొకసారి బెట్రండ్ రస్సెల్‌ను
గుర్తు చేసుకోండి
హేతు దృక్పథంతో నడవడం
సమన్వయం సయోధ్య సామరస్యం
శాంతి కోసం ఆలోచించండి
శాంతి మానవుని మార్గం
ప్రపంచానికి ఊపిరి...

## ధూళి

మా పల్లెలో
ఆకాశంవైపు చూస్తే
రాత్రుల్లో ఆకాశంలో
దీపాలు వేలాడదీశినట్లు
తారలువెలుగుతుండేవి
ఈ నగరంలో నక్షత్రాలకోసం
కళ్ళు భూతద్దాలుగాచేసుకుని వెతికినా
ఏ ఒక్కటీ కనిపించడంలేదు
కార్ఖానలు చిమ్మిన
ధూళితో ఆకాశం నిండిపోయింది
పల్లె స్వచ్ఛదనం ఇక్కడ లేదు
మనుషుల మస్తిష్కాలుకూడ
కలుషితమైపోయాయి
ఇలా మనిషి మారిపోతే
సమాజం ఏంకావాలి
ఆ పలకరింపులు ఆప్యాయతలెక్కడ
పల్లెలో అందరూ బంధువులే
పక్కింట్లో ఎవరున్నారోతెలియదు
ఈనగరంలోకార్ఖానలవల్ల
జీవితం సుఖమయమైయింది
కాని,వాతావరణమేకాదు
మనుషుల మనసులు కూడా
కలుషితమైయాయి..ఆరోగ్యందెబ్బతింది
తినడానికి అన్నీవున్నా తినలేని స్థితి
ప్రయాణ సాధనాల వల్ల
దేశాల మధ్య
ప్రయాణ సమయం తగ్గింది
కాని,మనసులమధ్య దూరం
బాగా పెరిగిపోయింది
స్వార్థం అనే ధూళికమ్మేసి
తమ లాభం తప్ప
ఇతరుల నష్టంతో పనిలేదెవరికి
కాలం మారింది
మనిషి తన ప్రేమ కోసం
ఖర్చుపెట్టడం మానేసి
పగతీర్చుకోవడం కోసం
ఖర్చుపెడుతున్నాడు
ప్రతిదేశం తన బడ్జెట్ లో
సగం కన్నా ఎక్కువ
శత్రుదేశం పై
పగతీర్చుకోవడంకోసం ఖర్చుపెడుతున్నది
పగలు, ప్రతీకారాలు కమ్ముకున్న
భూతలంపై
గౌతమ బుద్ధుడు మళ్ళీపుట్టి
అహింసా సిద్ధాంతాన్ని బోధించాలి

-ఎస్ .ఎమ్ .షరీఫ్, 9618045319

# ఊహించని సాయం



నరసింహపురంలో జాతరా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి చాలామంది ప్రజలు వచ్చారు. ఆ జాతరకు అదే గ్రామానికి చెందిన శరభయ్య తన కొడుకుని తీసుకొని వెళ్ళాడు. అతనికి ఏదైనా ఆట వస్తువును కొనిద్దామని శరభయ్య ఉద్దేశం . దారిలో ఒక యువకుడు కనిపించి" అయ్యా !మా అమ్మ ఆసుపత్రిలో ఉంది. వైద్యం కోసం నాకు డబ్బు కావాలి. అందుకై నా మెడలోని బంగారు గొలుసును అమ్ముతాను. మీరు తీసుకోండి. మీకు చాలా చౌకగా ఇస్తాను. నా అవసరం ఈ బంగారు గొలుసును నన్ను అమ్మే లాగున చేస్తున్నది" అని బ్రతిమిలాడాడు.

అది విన్న శరభయ్య "ఇంతకూ ఇది అసలు బంగారమా! నకిలీ బంగారమా!" అని ప్రశ్నించాడు. " అయ్యో! ఇది అసలు బంగారం అండి. కావాలంటే ఆ ఎదురుగా ఉన్న నగల దుకాణంలో మీరు పరిశీలించుకోవచ్చు" అని అన్నాడు ఆ యువకుడు.

వెంటనే ఆ శరభయ్య ఆ నగల దుకాణానికి వెళ్లి ఆ గొలుసును అది స్వచ్ఛమైన బంగారమా!కాదా! పరిశీలించమన్నాడు. వారు అది అసలైన బంగారమేనని చెప్పారు. వెంటనే ఆ యువకుడు "అయ్యా! ఆలస్యం చేయకండి. తొందరగా ఇది తీసుకొని నాకు డబ్బులు ఇవ్వండి. అక్కడ మా అమ్మ చావు బ్రతుకుల్లో ఉంది" అని అన్నాడు. అప్పుడు శరభయ్య "దీని ఖరీదు ఎంత ఇవ్వమంటావు?'' అని అడిగాడు. అప్పుడు ఆ యువకుడు "అయ్యా! ఇది ఇరవై గ్రాములు ఉంది. మీరు దుకాణంలో కొంటే రెండు లక్షలు అవుతుంది. నాకు కేవలం ఒక లక్ష రూపాయలు మాత్రమే ఇప్పించండి"అని అన్నాడు. అప్పుడు శరభయ్య " ఇంకా ఏమన్నా తక్కువ ధరకు రాదా!" అని అన్నాడు. "రాదండి . నేనే చాలా తక్కువ ధరను చెప్పాను" అని అన్నాడు యువకుడు. " ఏదీ ! ఆ బంగారు గొలుసు ఒకసారి ఇలా ఇవ్వు. మళ్లీ చూస్తాను" అని శరభయ్య ఆ గొలుసును తీసుకొని పరిశీలించసాగాడు .

అప్పుడే అక్కడికి పరిగెత్తుకొని వచ్చిన ఒక పాప "నాన్నా! వీడే ఆ దొంగ. నా మెడలోని బంగారు గొలుసును కొట్టేశాడు" అని అంది. అది గమనించిన ఆ యువకుడు ఆ బంగారు గొలుసును శరభయ్య వద్దనే వదిలి పరిగెత్తి పారిపోయాడు.

అప్పుడు ఆ పాపతండ్రి శరభయ్య చేతుల్లోని ఆ గొలుసును తీసుకొని "అయ్యా ! ఈ గొలుసు మాదేనండి. ఆ జన సమర్థంలో మా పాప మెడలోంచి ఈ దొంగ వెధవ దొంగిలించి పట్టుకొని వచ్చి మీకు అమ్మ చూపాడు . మా పాప అతడిని గుర్తుపట్టింది . ఈ గొలుసు మీరు కొనక పోవడమే మంచిదయింది. మీకు నా ధన్యవాదాలండి''అని అన్నాడు.

అప్పుడు శరభయ్య " అయ్యా! నేను ఈ గొలుసు కొనుటకు తటపటాయించి తాత్సారం చేయడం వల్లనే ఆ దొంగ మీకు కనిపించాడు. మీ గొలుసు దొరికింది. ఈ గొలుసును నేను కొంటే నేనే నష్టపోయేవాడిని"అని అన్నాడు. అప్పుడు ఆ పాప తండ్రి " ఔనండీ! వీడు ఎవరికంట పడకుండా తిరుగుతున్నాడు. మీ దయవల్ల మా గొలుసు మాకు దొరికింది'' అని అన్నాడు. అప్పుడు శరభయ్య "అందుకే ఆ దొంగ సొమ్ము నేను కొనలేదు. వాడు తక్కువ ధర చెప్పినప్పుడే నాకు అనుమానం వచ్చింది. నా అనుమానం నిజమైంది . పోనీ నేను కూడా మీకు ఊహించని సాయమే చేసినట్లు అయింది. నాకు ఒక మంచిపని చేసిన తృప్తి మిగిలింది"అని తన కొడుకును తీసుకొని ఆ జాతరా దుకాణాలు వైపు బయలుదేరాడు.

అందుకే పిల్లలూ! చౌకగా వస్తుందని అపరిచిత వ్యక్తులు అమ్మే ఆ దొంగ సొమ్ము కొనరాదు. మనం ప్రమాదంలో పడతాము. అలా దానిని ఎందుకు చౌకగా అమ్ముతున్నారో నిర్ధారించుకొన్న తర్వాతనే వుుందడుగు అడుగెయ్యాలి.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

# దాశరథి కృష్ణమాచార్య స్వీయ చరిత్ర " యాత్రా స్మృతి" : అర్ధ శతాబ్దపు తెలంగాణ చరిత్ర

'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని పలికిన మహాకవి, దాశరథి కృష్ణమాచార్య గారి శతజయంతి సంవత్సరం (1925–2025 ) ఇది. 'మా నిజాం రాజు తరతరాల బూజు ' అని నినదించిన ధిక్కార కవి దాశరథిని స్మరించుకునే సందర్భం ఇది. తెలంగాణ పేరు చెపితేనే దాశరథి గుర్తుకు వస్తారు. నిజాం నిరంకుశ పాలనలో కవులుగా నిజాంను ఎదిరించి నిలిచిన కవులలో దాశరథిని, కాళోజీని విశిష్టంగా చెప్పుకోవాలి. "కోటి తెలుగుల బంగారు కొండ క్రింద పరచుకొన్నట్టి సరసులోపల వసించి ప్రొద్దు పొద్దున అందాల పూలు పూయు నా తెలంగాణ తల్లి కంజాతవల్లి" అని ప్రవచించిన తెలంగాణ మట్టిని ప్రేమించిన మహాకవిని స్మరించుకునే సరి అయిన సందర్భం ఇది. తన పద్యాల్లో, కవితల్లో అడుగడుగున తెలంగాణ కనిపిస్తుంది, వినిపిస్తుంది. దాశరథి జీవితం, సాహిత్యం తెలంగాణ నేలతో మిళితమై ఉంటుంది. నిజాం నిరంకుశ పాలనలో ప్రజల పక్షాన నిలిచి నిజాం కు వ్యతిరేకంగా కవితలు వ్రాయాలంటే, పోరాడాలంటే ఒకింత ధైర్యం, త్యాగం కూడా కావాలే. తన ప్రాణాలను ఫణంగా పెట్టీ బతికి నిలిచిన ధీర కవి దాశరథి. తెలంగాణ పై అపారమైన



ప్రేమతో వారు ఇలా వ్రాశారు,

**"మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితాజనమ్ము కూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడపి నట్టి**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ"**

దాశరథి ఆత్మ కథ " యాత్రా స్మృతి" పుస్తక రూపంలో 60 విభాగాల్లో ఉంది. ప్రతి విభాగం మొదట్లో వారి రచనల్లోని మంచి కవిత, లేదా పద్యం కూర్చబడి ఉంది. జీవితం ఒక ప్రవాహం, ప్రయాణం లాంటిది, కొన్ని సంఘటనల ,సన్నివేశాల సమాహారం లాంటిది. దాశరథి గారు తన జీవితంలోని అనుభవాలను, జ్ఞాపకాలను మాలలో పూసగుచ్చినట్లు వరుసగా చెపుతూ పోయారు. " యాత్రా స్మృతి" చదువుతుంటే అది తెలంగాణ సాహిత్య చరిత్రలా కూడా తోస్తుంది. అరవై అధ్యాయాలలో ఒకో అధ్యాయానికి ఒక చక్కటి పేరు ఉంది. అందులో ఆయా విశేషాలు చక్కగా వివరించబడ్డాయి. ఆత్మ కథ రాసేనాటిని వారి వయసు సుమారు 55 ఏండ్లు దాటి ఉంటుంది. అది అప్పటి సుప్రసిద్ధ వార పత్రిక "ఆంధ్ర జ్యోతి " లో దాదాపు 70 వారాల పాటు సీరియల్ గా వచ్చి పాఠకులను అలరించింది. అది ఆ వార పత్రిక ఎడిటర్ సుప్రసిద్ధ రచయిత పురాణం సుబ్రహ్మణ్యం శర్మ గారి ప్రోద్భలంతో వ్రాయబడింది. అలా వ్రాయబడిన దాశరథి కృష్ణమాచార్య గారి స్వీయ చరిత్రను అర్ధ శతాబ్దపు తెలంగాణ చరిత్ర అని కూడా చెప్పవచ్చును. అది వారి అనుభవాల, జ్ఞాపకాల దొంతర ! దాశరథి గా ప్రసిద్ధి పొందిన దాశరథి కృష్ణమాచార్య గారు తన ఆత్మ కథలో " మాది వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలూకా గూడూరు గ్రామం" అన్నారు. ఇప్పుడు ఆ గ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ జిల్లాలో ఉంది. దాశరథి 22–7–1925 నాడు జన్మించారు. వారి తల్లిదండ్రులు దాశరథి వెంకటాచార్య, వెంకటమ్మ. సుప్రసిద్ధ రచయిత దాశరథి రంగాచార్య గారు వారి సహోదరులే! మొదటి అధ్యాయం

**'అంకురం'** లో దాశరథి తన జననం, బాల్య విద్య గురించి వివరించారు. నిజాం రాజ్యంలో బడిలో ఉర్దూలోనే తప్పని సరిగా నేర్చుకోవలసి వచ్చేది. ఇంట్లో తన తండ్రి గారి వద్ద సంస్కృతం నేర్చుకోవలసి వచ్చేది అని చెపుతూ, " నా బాల్యం నుంచి ఇంటా బయటా మాతృ భాష మీద దండయాత్రలు జరిగాయి" అని చెప్పారు వారు. "నువ్వు ఎటు వెళుతున్నావ్" అనడానికి "త్వంకుత్ర గచ్ఛసి" అనేవారు! సంస్కృతం మీద గౌరవమే గాని, ఇంతటి ఛాందసం నాకు నచ్చేది కాదు. మదర్సా బడిలో ఉర్దూలో ప్రార్థనతో మా దినచర్య ప్రారంభమయ్యేది. ("ప్రళయకాలం వరకూ పరమేశ్వరుడు ఈ రాజ్యాన్ని (హైదరాబాదు) సుస్థిరంగా వుంచుగాక. "తాబద్ ఖాలిఖె ఆలం, యెరియాసత్రక్తే" అనే పల్లవితో ఈ ప్రార్ధనా గీతం ప్రారంభమయ్యేది. ఏడుస్తూ ఈ ప్రార్థన చేసేవాళ్ళం. ప్రార్థన చేసేవారితో గొంతు కలపని వారిని కొట్టేవాడు హెడ్ మాస్టరు. అలా దెబ్బలు తిన్న వాళ్ళలో నేనొకట్టి. ఇలా ఇంటా, బయటా నా బాల్యంలొ తెలుగు మీద దండయాత్రలు ప్రారంభమయ్యాయి. నేను ఇంట్లోను, బడిలోను, ఎదురు తిరగవలసి వచ్చింది. నాలో తిరుగుబాటు బీజాలు ఆ విధంగా నాటుకున్నాయి." అన్నారు వారు.

తన ఆత్మ కథలో దాశరథి రుబాయిల నిర్మాణం గురించి, రుబాయిలు రాసిన కవుల గురించి, ఇక్బాల్ కవిత గురించి, గోలకొండ పత్రిక గురించి, ముషాయిరాల గురించి, గాలిబ్ గజల్ గురించి వివరించారు రెండు నుండి ఆరు అధ్యాయాలలో. ముఖ్యంగా గోలకొండ పత్రిక గురించి చెపుతూ," గోలకొండ పత్రిక 1925లో అవతరించింది. ప్రతాపరెడ్డిగారె సంపాదకులు. అప్పుడది ద్వైవార పత్రిక. వారి సంపాదకీయాలు అద్భుతంగా వుండేవి. నిజాం ప్రభుత్వానికి ఆ పత్రిక గుండెలో కుంపటి. 1947లో గోలకొండ దినపత్రికగా రాసాగింది." అన్నారు వారు.

## దాశరథి గారికి కవులన్నా, కవుల సభలు అన్నా చాలా ప్రీతి.

1949 లో విజయ వాడలో జరిగిన తొలి తెలుగు ఆస్థాన కవి చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారి పదవీ స్వీకారోత్సవం విశేషములు ఏడవ అధ్యాయంలో వివరించారు. ఎనిమిదవ అధ్యాయంలో 1953 జనవరి 11 వ తేదీన తుంగభద్రా నదీ తీరం లోని అలంపురంలో బ్రహ్మాండంగా జరిగిన "ఆంధ్ర సారస్వత పరిషత్" సప్తమ మహాసభల విశేషములు గురించి తెలిపారు. అట్టి సభలకు నాటి భారత ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ గారు ముఖ్య అతిథిగా వచ్చి సభలను ప్రారంభించారు. అప్పటి హైద్రాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు సాంస్కృతిక ప్రదర్శనను ప్రారంభించారు. ఆ సభలకు దేవులపల్లి రామానుజ రావు గారు సభాధ్యకత వహించారు. హైద్రాబాద్ నుండి వెయ్యి మందితో ఒక స్పెషల్ ట్రైన్ బయలు దేరింది ఆ సభలకు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి ఎందరో తెలుగు కవులు హాజరైనారు. సంస్కృత, కన్నడ, మరాఠీ, హిందీ కవులందరూ పాల్గొన్నారు తెలుగు కవులతో పాటు. విశ్వనాథ, శ్రీ శ్రీ, లాంటి ఉద్దండ కవులు హాజరు అయినారు ఆ సభలకు. ఆ సభలలోనే జనవరి 12 నాడు కాళోజీ "నా గొడవ" ను శ్రీ శ్రీ గారు ఆవిష్కరిస్తూ " కాళోజీ నిఖిలాంధ్ర కవి?" అని పొగిడారు.



"తుంగభద్రా నదీ తీరంలో, అలంపురం లో జరిగిన సారస్వత సభల వంటివి మళ్ళీ జరుగుతాయా? జరక్కపోవచ్చు అన్నంత బాగా జరిగాయి. తరతమ భేదాలు లేకుండా తెలుగు రచయితలు, ప్రముఖ రాజకీయ వేత్తలు ఒక్క వేదికమీద కూర్చున్నారు." అని రాశారు దాశరథి గారు. ఆ సభలలోనే " విశాలాంధ్రకు ఏకైక కళాకారుల సంస్థ శ్రీశ్రీ అధ్యక్షతన ఏర్పడినందుకు అంతా సంతోషించారు.

ఈ సంఘానికి "ఆంధ్ర కళాపరిషత్తు" అని నామకరణం చేసినట్లు జ్ఞాపకం " అని అన్నారు దాశరథి గారు. ఆ సందర్భం లోనే తుంగ – భద్ర నదులు కూడలి సంగమేశ్వరం వద్ద కృష్ణ నదిలో కలిసే విశేషాలు కూడా వివరించారు దాశరథి గారు . దాశరథి గారు తన సమకాలీన అనేక విషయాలను తన స్వీయ చరిత్ర లో విశద పరిచారు. అలాంటి విషయాల్లో అణా గ్రంథమాల ఒకటి. కె.సి. గుప్త ప్రచురణ కర్తగా, వెల్దుర్తి మాణిక్య రావు సంపాదకులుగా ఈ గ్రంథమాల 1938లో స్థాపించబడింది. ప్రతి పుస్తకం పాఠకుడికి ఒక అణాకే అందించాలనేది ఈ గ్రంథమాల ఆశయం. ఇక దాశరథి జీవితం పూల పాన్పు కాదు ముళ్ళ దారే ! నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా



వివిధ కార్యక్రమాల్లో చిన్ననాటి నుండే చురుకుగా పాల్గొనే వారు. ఆ విషయాన్నే చెపుతూ, " జన్మస్థానమే నాకు కృష్ణ జన్మస్థానం అయింది. యెంత అదృష్టం! శ్రీ కృష్ణ పరమాత్మ కారాగృహంలో పుట్టాడు. నేను పుట్టిన వూరిలోనన్ను గిరఫ్తార్ (అరెస్ట్) చేశారు.

ఆంధ్ర మహాసభ కార్యకర్తలతో కలిసి వరంగల్లు జిల్లాలో పర్యటిస్తున్న రోజులు వూరూరికి వెళ్ళి సభపెట్టడం, ప్రజల్ని నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాడి సిద్ధం చేయడం మా పని." అన్నారు వారు. అప్పుడు దాశరథి వయస్సు ఇరవై లోపే.

నిజాం నిరంకుశ పాలనలో " నాజీ జైలును మించిన నైజాం జైళు ల్లు" అని అన్నారు వారు

. జైలు లోని జీవితం గురించి చెపుతూ, " సాయంత్రం తినవలసిన రెండు ఉడికీ ఉడకని జొన్న రొట్టెలుతిని బేడా సర్దుకున్నాం. రొట్టెల్లో సిమెంటు కలిపికాల్చి యిచ్చే వారు పాపాత్ములు , అవి తిని అజీర్ణంతో యెందరో మరణించారు. నా జీర్ణకోశం ఆనాడే చెడింది (1947)." అన్నారు. వారి వయస్సు అప్పుడు 22 సంవత్సరములు. అప్పుడు వారు వరంగల్ జైలులో ఉన్నారు. అంతకు ముందు కాళోజీ నారాయణ రావు, వట్టికోట ఆళ్వార్ స్వామి మరి కొంత మందిని అజ్ఞాతంగా ఆ జైలు నుంచి వేరే జైలుకు మార్చా రు అని డాక్టరు ద్వారా తెలుస్తుంది దాశరథికి. ఒక రాత్రి వేళా ముప్పై మంది రాజకీయ ఖైదీలను వారి వారి సామాన్లు సర్దుకొమ్మని చెప్పి వాళ్లను రైలు ఎక్కించి, సికింద్రాబాద్ గుండా నిజామాబాద్ జైల్లోకి మార్చుతారు. నిజామాబాద్ జైలులో ఏడువందల మంది రాజకీయ ఖైదీలు ఉంచబడుతారు. ఆ కొండ మీది బందిఖాన నిజామాబాద్ జైలు గురించి ఇలా చెప్పారు దాశరథి. "యేడు వందలకు పైగా రాజకీయ ఖైదీలను నిజామాబాదు సెంట్రల్ జైలులో నిర్బంధించారు. ఒక్కటే నీళ్ళపంపు. అంతా అక్కడే స్నానం చేయాలి, బట్టలు వుతుక్కోవాలి, భోజనంచేసి పళ్ళెరాలు, నీళ్ళుత్రాగే అల్యూమినియం గొట్టాలను కడుక్కోవాలి. ఉదయం ఆరు కానిదే బ్యారక్సోనుంచి బయటికి రానిచ్చేవారు కాదు బర్కందాజులు (వార్డెనులు)...... ఇంతకీ కొండల మీదిది అసలు జైలే కాదు. శ్రీ రామ మందిరాన్ని, సత్రాల గదులను సెంట్రల్ జైలు గదులుగా మార్చి రాజకీయ ఖైదీలను అందులో వుంచారు నిజాం ప్రభుత్వం వారు?.. జైల్లో ఆజానుబాహువు. నారింజపండు ఛాయలో వట్టికోట ఆళ్వార్ స్వామి (ప్రజల మనిషి – నవలా రచయిత) సాక్షాత్కరించాడు?. రఘునాథరాయలు మహారాష్ట్ర వీరుడు. శివాజీ అనుచరుడు. అతను నిర్మించినకోట, కోటలో శ్రీరామాలయం, సత్రాలూ ఈనాడు కారాగృహంగా మారాయి.

అయ్యో! కాలమహిమ! కానీ, ఒకనాటికి కాలచక్రం మళ్ళీ తిరుగుతుంది. ఇది ఆలయమో, విద్యలకు ఆలయమో అవుతుంది అనిపించింది నాకు. ఒక పద్యం అశువుగా చెప్పాను ఆనాడు:– (1947)

"ఒక కాలమ్మున ఇది దేవళము, వేరొక్కప్పుడు దుర్గంబు, నేడకటా! జైలయి కానుపించెను; భవిష్యత్కాలమందెట్టి రూపకమున్దాల్చునొ? కాలచక్రగమన స్వాభావికావర్త వివర్తార్త కల్పనమై విద్యల కాలయమ్మగును; ఈ బందీలెపాలింపగా" మేము స్వతంత్రులమై మా రాష్ట్రాన్ని మేము పాలించుకుంటాం. అప్పుడు ఈ కొండ మీది బందిఖానా కాలేజీ అవుతుంది అన్నాను. కవి వాక్యము రిత్తవోవునె?". ఇవి దాశరథి మాటలు. కవి వాక్కు, బాలవాక్కు, బ్రహ్మ వాక్కు నిజమవుతాయి అంటారు. నిజామాబాద్‌లో ఉన్న గిర్రాజ్ ప్రభుత్వ కళాశాల 1956లో ఆ కోట ప్రాంగణంలోనే ప్రైవేట్ నిర్వహణలో స్థాపించబడింది. దీని స్థాపన కోసం ఉదారంగా 50,001 రూపాయల విరాళం ఇచ్చిన శ్రీ గిర్రాజ్‌మల్జీ అగర్వాల్ పేరు మీద దీనికి ఆ పేరు పెట్టారు. ఈ కళాశాలను 1960లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది మరియు 1968లో ఆ కళాశాల ప్రస్తుత 27.3 ఎకరాల నూతన క్యాంపస్‌కు మార్చబడింది. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి శిక్ష అనుభవించిన దాశరథి, వట్టికోట జైలు లోపల రచనలు చేశారు.

'నా తెలంగాణ.. కోటి రత్నాల వీణ' పద్యాలు దాశరథి జైలు గోడలపై రాశారు. 1948 జనవరి 30న గాంధీ మరణించినప్పుడు 'క్షమామూర్తి' అనే సంస్మరణ పద్యాన్ని దాశరథి జైలులోనే రాశారు. 1949లో దాశరథి రచించిన 'అగ్నిధార' కావ్యాన్ని ప్రచురించగా ఇందులో కనీసం సగం కవితలు ఈ జైలులో రాసినవేనని, ఆళ్వారుస్వామి 1955లో



ప్రచురించిన 'ప్రజల మనిషి' నవలలో హీరో కంఠీరవం జైలు జీవితం గురించి తెలియజెప్పిన ఒక అధ్యాయం అంతా ఇక్కడి అనుభవాలేనని సాహిత్య కారులు చెప్తున్నారు. ఇంకా దాశరథి గారు నిజామాబాద్ జైలులోని దారుణాల గురించి వ్రాశారు. 1948 జనవరి 12 నాడు రాత్రి రజాకార్లు జైల్లో చొరబడి రాజకీయ ఖైదీలను హింసించిన తీరు గురించి చెపుతూ," ? బరిచీలతో, బల్లాలతో, కత్తికటార్లతో, హాకీ స్టిక్కులతో రజాకార్లు జైల్లో చొరబడి సత్యాగ్రహులను ఆ అపర సంధ్యా సమయాన చావబాదారంటే– దీని వెనుక ప్రభుత్వ అనుమతి కుట్రలేదా? వుంది. " అన్నారు దాశరథి. అలాంటి క్రమంలో రాక్షసులని ఎదిరించిన రాజకీయ ఖైదీల గురించి, జైలులో నిస్సహాయుల నిరసనవ్రతం గురించి, చెర నుండి పలాయనం చిత్తగించి తప్పించుకున్న ఖైదీల గురించి కూడా వ్రాశారు దాశరథి.

"నిజామాబాదు జైల్లో రజాకార్ల దాడుల్లో గాయపడి, ఆరోగ్యం పూర్తిగా కోల్పోయిన అస్మదాదులను కొందరిని చికిత్సకోసం హైద్రాబాదు సెంట్రల్ జైలుకు (చంచల్ గూడా జైలు) మార్చాలనీ, అక్కడవుంటే ఉస్మానియా జనరల్ హాస్పిటల్లో చికిత్స చేయించ వచ్చుననీ, అప్పటి పోలీసుశాఖామంత్రి అబ్దుల్ హమీద్ ఖాన్ సూచన చేశాడు. ఆ సూచన మేరకు మమ్మల్ని కొద్దిమందిని నిజామాబాదు జైలు నుంచి (హైదరాబాదు) మార్చడానికి నిర్ణయించారు." అని వ్రాశారు దాశరథి. అలా దాశరథి మరి కొందరు

రాజకీయ ఖైదీలు హైదరాబాద్ సెంట్రల్ జైలుకు మార్చబడతారు. ఆ జైలు లోనే స్వామి రామానంద తీర్థను కలుసుకొని సంతోషిస్తారు దాశరథి. అక్కడే 1940 లో వందేమాతరం రామచంద్ర రావు 36 కొరడా దెబ్బలు తిని దెబ్బదెబ్బకు వందేమాతరం అంటూ సొమ్మసిల్లి పడిపోయిన విషయం గురించి స్వామి రామానంద తీర్థ ద్వారా అడిగి తెలుసుకుంటారు. 1948 సెప్టెంబర్ మాసం నిజాం ప్రైవేటు సైన్యం రజాకార్లు ఆగడాలు ఇంకా పెరిగిపోయాయి తెలంగాణ పల్లెల్లో. సెప్టెంబర్ 17 నాటికి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి సర్దార్ పటేల్ చొరవతో మేజర్ జనరల్ చౌదరీ నాయకత్వాన నిజాం సైన్యం లొంగి పోతుంది. ఆ సైనిక చర్యకు ఆపరేషన్ పోలో అని పేరు. నిజాం నిరంకుశ పాలన ముగుస్తుంది. రజాకార్ల పీడ




విరగడ అవుతుంది. దక్కన్ రేడియో ద్వారా నిజాం లొంగిపోయినట్లుగా ప్రకటిస్తాడు. ఆ తర్వాత జనరల్ చౌదరీ మిలిటరీ గవర్నర్ గా నియమితులు అవుతారు. పద్నాలుగు నెలల మిలిటరీ పరిపాలన ముగిసి పరిస్థితులు కుదుటపడ్డ తర్వాత సైనిక పరిపాలన తొలగిపోయి సివిలియన్ పరిపాలన ఎం . కె. వెల్లోడి ముఖ్య పరిపాలనాధికారిగా నియమింపబడుతాడు.

తర్వాత "పందొమ్మిది వందల యాభై రెండులో తొలి సాధారణ ఎన్నికలు జరిగాయి. శాసనసభలో కాంగ్రెసు పార్టీకి మెజారిటీ లభించింది. నాయకుడుగా బూర్గుల రామకృష్ణరావు గారిని ఎన్నుకున్నారు. ఆయనే ముఖ్యమంత్రి, గవర్నరు పదవికి బదులు సంస్థానం గనుక, నిజాం నవాబునే రాజ ప్రముఖ్ నియమించారు." ఇవి దాశరథి వెల్లడించిన విషయాలు హైదరాబాద్ రాష్ట్రంలో 1952 సాధారణ ఎన్నికలు జరిగే వరకు. దాశరథి తన ఆత్మ కథలో 1950 సంవత్సరంలో ఏర్పడిన తెలంగాణ రచయితల సంఘం కు తను అధ్యక్షునిగా, కాళోజీ ఉపాధ్యక్షుడుగా, సి. నారాయణ రెడ్డి కార్యదర్శిగా, డి. రామలింగం సంయుక్త కార్యదర్శిగా ఉన్న విషయాలను ప్రస్తావించారు. 1901 లో స్థాపించబడిన శ్రీ కృష్ణ దేవరాయ భాషంధ్ర నిలయం సాహిత్య సేవ గురించి, తె.ర.సం. మొదటి వార్షిక సభల గురించి, తె. ర.సం. పక్షంగా వెలువడిన" మంజీర" మాసపత్రిక ప్రత్యేక సంచిక గురించి, తెలంగాణ పై వచ్చిన సమర కావ్యాలు ఆరుద్ర " త్వమేవాహం", సోమసుందర్ "

"వజ్రాయుధం", కుందుర్తి " తెలంగాణ" గురించి ప్రస్తావించారు. అలానే వట్టికోట ఆళ్వార్ స్వామి " ప్రజల మనిషి", దాశరథి రంగాచార్య " చిల్లర దేవుళ్ళు" నవలల గురించి ప్రస్తావించారు. అభినవ పోతన వానమామలై వరదా చార్యుల గురించి చెప్పారు. దాశరథి తన జీవిత చరిత్ర "యాత్రా స్మృతి" ని 60 అధ్యాయాలలో ముగించాడు, అది కూడా ఆంధ్ర రాష్ట్రం, తెలంగాణ కలిసి పోయి "ఆంధ్ర ప్రదేశ్ " సమైక్య రాష్ట్రం ఏర్పాటుతో ముగించాడు.

దాశరథి తెలంగాణ బిడ్డ అయినా సమైక్యాంధ్ర వాది . 1953 లో " మహాంధ్రోదయం" అనే కవిత రాసి బహుమతి పొంది తర్వాత " మహాంధ్రోదయం"అనే ఖండ కావ్యం వ్రాశారు . ఆంధ్ర, తెలంగాణ కలిసిపోయి విశాలాంధ్ర ఏర్పడాలని కోరుకున్నారు దాశరథి. ఆత్మ కథ లోని వారి మాటల్లోనే :

"అవతరించిన ఆంధ్ర రాష్ట్రం సంయుక్త మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలతోనే యేర్పడిందేగాని, కోటికి పైగా ఉన్న తెలంగాణా, హైదరాబాదు రాష్ట్రంలోనే ఉండిపోయింది.

తెలుగు ప్రాంతాలన్నీ ఏకమై విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడాలనేదే అందరి కోరిక. ఆ కోరిక యెప్పటికి తీరునో? అనుకుంటూ వుండేవాళ్ళం.

రచయితలు, కళాకారులు యెప్పుడూ విశాలాంధ్ర రాష్ట్రం కోరినవారే." బహుశా ఇది సమైక్యవాది దాశరథి అభిలాష కావచ్చు, అందరి తెలంగాణ బిడ్డల అభిలాష అయి ఉండదు.

1948లో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైన తర్వాత, స్థానికేతరులకు ఉద్యోగాలలో ప్రాధాన్యం లభించడం ప్రారంభమైంది. ఇది స్థానికులలో అసంతృప్తికి దారితీసింది. అదే 1952 ముల్కీ ఉద్యమం హైదరాబాద్ రాష్ట్రంలో స్థానిక ఉద్యోగుల హక్కుల కోసం జరిగిన ఉద్యమం.

1954 లో ఫజల్ ఆలీ గారి అధ్యక్షతన ఏర్పడిన పునర్వ్యవస్థీకరణ సంఘం కూడా తెలంగాణాను ఆంధ్రా తో కలపడానికి సిఫారస్ చేయలేదు. అలాంటి విషయాలను పక్కన పెట్టి దాశరథి విశాలాంధ్రకే మొగ్గు చూపారు. అప్పటి హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుగారు ఆంధ్ర–తెలంగాణా సంలీనానికి అనుకూలురు కావడం స్వాతంత్ర్యోద్యమ సారథి రామానంద తీర్థ హైదరాబాద్ విభజనకు , విశాలాంధ్ర నిర్మాణానికి పట్టు పట్టడం, భారత ప్రధాని నెహ్రూ సమ్మతించడం ఫలితంగా పెద్ద మనుషుల ఒప్పందం ననుసరించి ఆంధ్ర, తెలంగాణ కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నవంబర్ 1 నాడు ఏర్పడింది.

అప్పుడు దాశరథి, "నాలుగు కోట్ల తెల్గుల మనమ్ములలోన తెలుంగు తల్లిదీ పాలను పెట్టినట్టి శుభవాసర మియ్యది" "నవంబరు ఒకటి పందొమ్మిది వందల యాభై ఆరు." అని వ్రాశారు. ఆంధ్రా తెలంగాణ కలిసి బావుకున్నదేమి లేదు. తెలంగాణకే కష్టాలు, నష్టాలు వచ్చాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని 1969లో బలమైన ఉద్యమమే వచ్చింది. మూడు వందల డెబ్బయి మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు దాశరథి సమ్మతంగా ఉన్నట్టు ఎక్కడా కనిపించలేదు. దాశరథి "మహాంధ్రోదయం" రాసి విశాలాంధ్రనే కోరుకున్న సమైక్య వాది. అందుకే,

"ముక్కలైన మాతృమూర్తి గేహమ్మును కూర్చి కట్టినట్టి కొమరులార! ఐకమత్య బంధమన్ని కాలాలలో నిలిచియుండుగాక తెలుగునేల." అని ఆకాంక్షించారు కూడా. కానీ సమైక్య రాష్ట్రంలో దగాపడ్డ తెలంగాణ అరవై ఏండ్లు కొట్లాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకుంది. సమన్యాయం, సమ ధర్మం కరువైన నేలలో సత్యంగా, ధర్మంగా, న్యాయంగా పోరాడి 2001 నుండి 2014 వరకు మలిదశ తెలంగాణ ఉద్యమంలో పోరాడి తెలంగాణ తెచ్చుకుంది. దాశరథి కల ఈ ఒక్క విషయంలో నిజమై నిలువలేదు.

**"మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితాజనమ్ము కూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడపి నట్టి**
**నా తెలంగాణ కోటిరత్నాల వీణ "** అని పలికిన

ఈ తెలంగాణ ముద్దు బిడ్డ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, అన్యాయాన్ని ఎదురించి జైలు పాలై , చిత్ర హింసలకు గురి అయి కవితలల్లిన కలం సైనికుడు సమైక్య రాష్ట్రంలో వలసవాద పాలనలో కష్టాల, కన్నీటి తెలంగాణను, దగాపడ్డ తెలంగాణను కాదని సమైక్య వాదానికే కట్టుబడి ఉండడం బహుశా అది దాశరథి వ్యక్తిగత అభీష్టం కావచ్చు. తెలంగాణ ప్రభుత్వం దాశరథి పేరుతో ఒక లక్ష రూపాయల అవార్డుతో ప్రతి ఏటా ఒక తెలంగాణ కవికి ఇస్తూ సన్మానిస్తుంది. దాశరథిని బంధించిన నిజామాబాద్

ఖిలా జైలును దాశరథి స్మారక చిహ్నంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుంది. ఈ వ్యాసం రాస్తున్న సందర్భం లోనే తేది 15–7–2025 నాడు మిత్రుడు సంకేపల్లి నాగేంద్రశర్మ తో కలిసి నిజామాబాద్ లోని రఘునాథలయం ఖిలా రామాలయం ప్రాంగణంలో ఉన్న దాశరథి మొదలగు కవులను బంధించిన జైలు పరిసరాలను సందర్శించడం జరిగింది.

కవి, కథకుడు, నాటకకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రధానమంత్రి తామ్రపత్ర సన్మాన గ్రహీత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఆంధ్ర విశ్వవిద్యాలయం చేత కళాప్రపూర్ణ బిరుదాంకితులు, ఆగ్రా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల నుండి డి.లిట్ బిరుదం పొందినవారు, ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి పదవినలంకరించినవారు, అమెరికా, బ్రిటన్, రష్యా, మలేషియా, కెనడా మొదలైనదేశాలలో పర్యటించిన దాశరథి తేది 5–11–1987న అంటే ప్రభవ నామ సంవత్సరం కార్తికపూర్ణిమ పగటిపూట అస్తమించారు. దాశరథి 22–7–1925 నాడు జన్మించారు. ఈ ఏడు వారి శత జయంతి సంవత్సరం. వారికి ఘనమైన శత జయంతి నివాళి!

( దాశరథి శత జయంతి 22–7–2025 (1925–2025) సందర్భంగా )



**– సబ్బని లక్ష్మీనారాయణ,**
మొబైల్: 8985251271.

---



**కవితార్చన**

అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
–సంపాదకులు

## కొత్త వేకువ కోసం

తూరుపు తెలవారుతోంది
బాలభానుడు పైకి రాకముందే
ఆశల తాపత్రయం ఆకలి మెతుకుల పోరాటం ...
ప్రతి వందమంది జనాభాలో ఇద్దరైనా అనాథ బాలలు
జానెడు పొట్ట నింపడం కోసం అధిక శ్రమ చేస్తున్న అభాగ్యులు..
కాగితాలు ఏరుతూ,సామాన్లు మోస్తూ
ఎర్రటి ఎండలో కాలికి చెప్పు లేకుండా
చమటలు కారుస్తూ
రూపాయి కోసం ఆరాటం..
అదృష్ట విహీనులు, శాపగ్రస్త బాలలు
బతుకు భారమైన కడుపు లో పేగులు మెలి పెడుతున్నా
నిర్విరామంగా పరుగులు పెడుతూనే ఉంటారు..
సాయం చేతులు లేకున్నా ఛీత్కరించే
పెదవులు అనేకం
ఆదరించే హృదయం కానరాదు..
పసిపిల్లలు ఒక్క రూపాయి దానంచేస్తే
ఆస్తులు కరిగి పోతాయా
కనికరంలేని కఠిన హృదయులు ..
ఎప్పటికీ వీరి బ్రతుకుల్లో కొత్త వేకువ వచ్చేను
వీరి జీవితాలకు ఓదార్పు కలిగెను
ప్రభుత్వం ఈ అభాగ్యుల జీవితాలకు
పరిష్కారం చూపేరు
ఎవరో ఒకరు అడుగు ముందుకు వేసి
అనాథలకు ఆశ్రయం ఇస్తారు...

**–బిరుదు రాజు ప్రమీల రాణి**
96401 15956

## చదువు- సంస్కారం

చదువు జ్ఞానం ఇవ్వగా,
చీకటి నుండి వెలుగులోకి తీసుకురాను రాగా,
అన్ని విషయాలు తెలిపి,
ఉద్యోగాన్ని ఇప్పించగలరు.
అందరికీ చదువు సంస్కారం ఇవ్వదు.
చదువుకొని సంస్కారం లేని వాళ్ళు ఉన్నారు కదా.
చదువుకోకుండా సంస్కారంగా ప్రవర్తించేవారు
ఉన్నారు కదా.
సంస్కారం మనిషి మనస్తత్వంతో ఉంటుంది.
కొంతమందికి చదువుతూ అహంకారం రావచ్చు.
అహంకారంతో ఉన్నవారికి సంస్కారం ఉండదు కదా.
మేమే గొప్ప మాకే అన్నీ తెలుసు కొందరు
అనుకుంటారు కదా.
సంస్కారము, మంచి ప్రవర్తన మానవత్వము,
చదువు తో వస్తుంది కొందరికి.
పెద్దవాళ్లు నేర్పితే వస్తుంది కొందరికి.
చదువుకున్నా మార్పు రాదు కొందరికి.
క్రమ శిక్షణ రావాలి.
ఆలోచించగలిగి ఉండాలి.
చదువు సంస్కారం రెండూ ఉండవు కొందరికి.

**–షహనాజ్ బతుల్**

## నేనే పండుగ

నేను పండుగను...
పువ్వులే కాదు, నవ్వులా పూస్తాను,
ప్రతి ఇంటి వాకిలిలో కాదు,
ప్రతి హృదయంలోనూ వెలుగుతాను?
నన్ను చూడగానే మొహాలు మురిసిపోతాయి,
పెద్దల చెవిలో కథల తీపి వినిపిస్తాను,
పిల్లల చేతుల్లో రంగుల గుబ్బలు,
వాళ్ల కన్నుల్లో ఆనందపు వెలుగులు!
నేను వొస్తే...
ఒంటరిగా ఉండేవాడు కూడా పలకరింపు కోరుకుంటాడు,
తన్ను తానే మరిచిపోయినవాడు ?
తన జ్ఞాపకాల కెరటాల్లో మునిగిపోతాడు?
నా వస్త్రం కొత్తగా ఉండకపోవచ్చు,
కానీ నా ఉనికిలో నవీనం ఉంటుంది,
నా మాటలు పాతవైనా ?
వాటి అర్థం మాత్రం జీవితానికే ఆధారం అవుతాయి?
నేను మందిరాలూ, మార్కెట్లూ మాత్రమే కాదు
నీ నిదురలో వచ్చిన తల్లి వంటల వాసనను,
నీ బాల్యపు చీరలో మల్లెపూల చిరునవ్వును,
నీ చిన్ననాటి దోసిళ్లలోనూ దాగి ఉంటాను?
నేను పండుగను?
అన్నీ మర్చిపోయే ఒక రోజును కాదు,
నీ జీవితం ఎలా ఉండాలో గుర్తు చేసే రోజును!
నేను పండుగను?
ఓ తాత చెప్పిన ఉపన్యాసం,
ఓ నాయనమ్మ చెప్పిన శుభకాంక్షలు
ఓ తమ్ముడు అడిగిన జిలేబీ,
ఓ చెల్లి పంచుకున్న పట్టు చీర స్పర్శ!

**–వి . సంధ్యా**
+91 90636 26333

## కలల దేవత

ఓ నా అలివేణి కలల దేవతా
ఇలా వచ్చి అలా మాయమయ్యావు
ఎంతని వెదకను ఎక్కడని చూడను
ఒక్కసారి కనిపించావు చేరుకునేలోగా
దూరమయ్యావు మెరుపులా మెరిసావు
ఏమిటి నాకీ పరీక్ష ఎందుకు నాకీ శిక్ష
ప్రేమించడమే నేరమా దయలేదా భగవంతునికి
మనసు పలికే వేళ మాటలుండవా?
మమతలు దూరాలా?
పలుకే బంగారమా? నేను దేనిలో తక్కువ
చక్కని ఉద్యోగం చేతినిండా డబ్బులు
మనసు నిండా మధుర మైన ప్రేమ
పెద్దలు నిశ్చయించాలనా?
ఓ అలాగే రేపే వస్తా
మావారితో మాట్లాడతా పెద్దలతో
కలల కాలంలో కలిసి ఒకటవుదాం
కలకాలం కలిసి వుందాం తలయెత్తు కళ్ళల్లో
కళ్ళు కలిపి చూడు
నాకు ఉత్సాహ మందించు
నా ఆశ శ్వాస నీవె ప్రియా
నీకై నా హృది మది ఎదురు చూసేను
ఒకటై పోయి ఎలుదాం ప్రేమ సామ్రాజ్య లోకాన్ని....

**–కే. శ్యామల దేవి**
78932 29318

## శోభాయమానం.

సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు
మన భారతదేశం...
కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు
వివిధ పండుగల సమాహారం...
పండుగ వాతావరణం తో విలసిల్లే
ప్రకృతి శోభాయమానం...
తెలుగు వారి గర్వించదగ్గ ఆచారాల్లో
పండుగలు మరీ ముఖ్యం ...
ప్రతి పండుగ కాలగమనం లో మార్పుకు
సూచకం...
సంవత్సరాది ఉగాది నాటి లేలేత
మావి చిగుర్లు చిగురించే సమయాన
ఉగాది వచ్చడి తిన్నవేళ కోకిల
గానామృతం...
శ్రీరామనవమి నాటి పవిత్ర తీర్థం తో
రామ నామ జపం,
సీతారాముని కల్యాణ వైభోగం ...
తొలి ఏకాదశి విష్ణుసంకీర్తనం,
బోనాల పండుగలో అమ్మవారికి బోన
సమర్పణం ...
ఆషాఢ మాస గోరింటాకు శోభలతో
ముదితల మురిసెం...
విఘ్నాలను బాపేటి వినాయక చవితి
సంబరాల సముత్సాహం...
దసరా పండుగలో దేవి నవరాత్రుల
దుర్గమ్మ
అలంకరణం ...
అందంగా పేర్చిన రంగురంగుల
బతుకమ్మల కమనీయ దృశ్యం...
సప్తవర్ణ పట్టు వస్త్రధారణ తో
ఆటపాటల నృత్య కోలాహలం...
దీపావళి దివ్యమైన వెలుగులతో
భువి మొత్తం దివి లా
ప్రజ్వరిల్లే అద్భుతం...
భోగి సంక్రాంతి కనుమ పండుగల
భాగభాగ్యాలనొనరించే
సిరిధాన్యాల మహా పర్వదినం...
శివధ్యాస లో ఉపవాస దీక్షతో
శివరాత్రి నాడు
శివుని మీద మనసు నిమగ్నం ?
ఇలా ఇంటింటా కళను పెంచే
మన సంస్కృతిని ఆచరింపజేసే
పండుగలతో జీవితం ఆరోగ్యకారకం
?ఆనందదాయకం?

**–డాక్టర్ శాంతిశ్రీ**
+91 91545 71932

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1521వ రోజు 'చెట్టు నీడ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'చెట్టు నీడ' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



### కుసుమ విలాసాల

విరామమెరుగని పాదాలు
అలసి సొలసి సేదదీరాలని
తల్లి లాంటి చెట్టు నీడకై ఆశ
నెత్తిన సూరీడు
ఎండ తీవ్రత మండిపోతూ
ఎడారిని మరిపించే
తొవ్వ లేదే ఓ చెట్టైన.
దూపతో దూరం నడవలేక శోష
శత్రువుకైనా రాకూడదు ఈ గోస
కనుచూపులో
ఓ బావి కనబడినా చాలు
ఓ పచ్చని చెట్టు ఓదార్చక పోదు
నీరింట దోవెంట.
చెట్లు తోబుట్టువులకంటే ఎక్కువేనేమో
తరాలకు తరగని పచ్చనాకుల జోల
పక్షుల్ని స్వాగతించి పాలించే ఊయల
తాను గూడై తోడై పూలతలజపమాల.
వాన కోయిల పల్లవికి పల్లకీ పాట
పల్లెంక పిట్టలకు చిట్టి ఉడుతలాటకు
చిగురేసి చిందేసి వసంతరాగాల కోయిల
చిరు జల్లు చినుకులకు గొడుగుపట్టే చేల.
ఈ దారికి నేనే
చెట్ల పద్మాలను నాటాలి
పత్రహరితాన్నై పూలపరాగరేణువునై
భాష్పోత్సేక హర్షాన్నై
తేనెపట్టుకు తావునై
ఓ పచ్చని చెట్టునవాలి
నాలాంటి బాటసారులకు
భరోసానివ్వాలి.

**-ఏడెల్లి రాములు**

### పచ్చని చెట్లు

నా జీవ వాహినిలో
అందమైన రూపకల్పన
నవవసంతంలో
నవజీవన మధురిమలు
మా జీవన మాధుర్యాలు
నా సహచరులు ఆత్మబంధువులు
నా మానస కుటీరంలో
సదా తోడునీడగా నిలిచి
నాసంతోష సరిగమలకు
నాకు మార్గదర్శి అయినవి
పచ్చని చెట్లే
వాటి నీడ
తమ మంద మారుత వీచికలలో
ఉయ్యాలలూపుతూ
తమ తీయని వెచ్చని
ఒడిని చేర్చుకుని
అలసిసొలసి విశ్రాంతికై తపించే వేళ
చల్లని పిల్లగాలులతో సేదతీరిచి
ఆనందపరుస్తాయి
ఇక్కడికి వచ్చినప్పటి నుండి పెంచిన చెట్లు
ఆత్మీయ సౌరభాలు అందించే
నా చిన్నారి పొన్నారి చెట్లు
నాకుప్రాణం
మరుపురానివి మరువలేనివి
నా ప్రియ బంధువులు
మిత్రులు, నాపిల్లలతో సమానం
నా జీవన నవవసంతమా
మీ తోడిదే నాకు ఆనందం
మీరు వసంత వేళ
పచ్చగా కనువిందుగా ఉంటే
సంతోషంతో కేరింతలు కొట్టి
చుట్టూ చేరి
ఆట పాటలలో మునిగేది నా చిన్నారులు
మా అందరికీ ప్రాణవాయువు ఇచ్చి
కాపాడేవి నా ప్రియమైన చెట్లు
నా ఇంట్లో విశాలమైన కొమ్మలు పరిచి
మానసిక ఉల్లాసం కలిగించే పచ్చని చెట్లు
వాటి నీడ నాకెంతో ఆనందం.

**-ఆర్. రమాదేవి**

### ఊసుల మర్రి

ఎండవేడికి తాళలేక
నీడను వెతుక్కుంటూ
వృద్ధమిత్రులమిద్దరమూ
అటూ ఇటూ చూస్తూ
వెయ్యగలిగినంత వడివడిగా
అడుగులు వేశాం
అదిగదిగో ఊడలమర్రి!.
ఊపిరి తీసుకుంటూ
చెట్టు వంక చూస్తూ
చెట్టు కింద చతికిలబడ్డాం
ఎన్నేళ్ళ క్రితమో జన్మనెత్తి
భూమాతకు తోడుగా
ఊడలపై ఊడలనందిస్తూ
ఊహల ఉయ్యాలలనూపుతూ
ఊరివారికి చల్లదనాన్నిస్తూ
తరతరాలుగా నిలిచిన చెట్టు.
పసితనంలో మమ్మల్ని
దెయ్యాల మర్రిగా
భయపెట్టిన పే....ద్ద చెట్టు
చిన్నప్పటి కథలను
మక్కువతో గుర్తు చేసుకున్నాం
జీవితమందించిన
మధురానుభూతులను
మననం చేసుకున్నాం
కష్టసుఖాలను కలబోసుకున్నాం
ఎన్నెన్నో ఊసులు చెప్పుకున్నాం.
ముచ్చట్లుచెప్పుకుంటూనే ఉంటాం
ప్రతిరోజూ
ఉందిగా మా కోసం
మా ఊసుల మర్రి!.

**-ముద్దు వెంకటలక్ష్మి**

### విచిత్రం!

పశువులు సేదతీర్చుకునేందుకు
పనికివచ్చింది మండుటెండలో
మనుషుల మాటామంతికి సైతం
ఉపయోగపడే కడు ఉల్లాసంగా
తారతమ్యం కనబడదు
చెట్టునీడకు
మనిషికైన పశువుకైన ఊరట కల్గించు
సూర్య తాపం నుండి
అందిస్తుంది ప్రాణవాయువును
నీడ ఎక్కువైన నిలవవు
మొక్కలు చెట్టునీడ కింద
పరులకు మేలు చేసే చెట్టునీడ
స్వజాతికి కీడు చేయును చూడు
ప్రకృతి ఎంత విచిత్రం!.

**-గుండం మోహన్ రెడ్డి**

### పాడేను జోల!

గట్టు కాడ చెట్టునీడ
పాడేను జోల
అలసిసొలసిన కాయం
చెమటతో దేహం
వ్యథతో రగిలే గుండెను
చెట్టుతల్లి ఒడిని చేర్చి ఓదార్చు
కొమ్మలనూపి చిచ్చుకొట్టు.
"మా ఊరెద్దు మీఊరికిరాదు
మీఊరెద్దు మాఊరికిరాదు
కదులు నడవదు
చెప్పుకో చూద్దామంటూ సామెతలు
ఋష్యాశ్రమాలు
గురుకులాల్లో
చెట్టునీడ నే విద్యాభ్యాసం
రామలక్ష్మణులు పాండవులు
అరణ్యవాసంలో
చెట్టునీడనే సేదతీరే
వేటకెళ్లిన మహారాజైనా
గుర్రాన్ని చెట్టుకి కట్టి కునుకుతీసే
అశోకవనంలో సీతమ్మ వేదనవినే.
యాత్రలకై పాత్రలతో
ఇంటిల్లిపాది ఎడ్లబండిలో ప్రయాణం
నెమరువేస్తూ మూగజీవులు
వంటావార్పు భోజనాలసందళ్లు.
పగలు ఆక్సిజన్ విడుదలతో
పిల్లల కోతికొమ్మచ్చి ఆటలతో
పులకించు చెట్టు
రావిచెట్టు ప్రదక్షిణాలతో
మానసిక రోగాలు తగ్గు.
ఊయల ఊపులతో కేరింతలు.
టోపీలవాడు చెట్టునీడ విశ్రాంతి
కోతుల హంగామా కిచకిచలకి
తననెత్తి టోపీ విసిరి
సేకరించిన టోపీలతో పయనం
నీతిబోధతో పాటు
పశుపక్షులకు ఆశ్రయం ఇచ్చే
చెట్టు విశాలత్వం
నేటి మనిషిలో మృగ్యం.
పెట్టిన చేతిని కరిచే ప్రబుద్ధులం
బాటపై అడ్డదిడ్డంగా చెట్లను నరికి
కబ్జాలు, చెట్టునీడ కరువై
అల్లాడు జీవాలు.

**-ఎ.రాజ్యశ్రీ**

### ప్రకృతమ్మ ఒడి

మండుటెండలో
చల్లని ఒయాసిస్సు
చిట పట చినుకులలో
అమ్మ పైటకొంగు
సాధు జంతువులైనా
క్రూర జంతువులైనా
సకల జీవులను
అక్కున చేర్చుకొని
మధ్యాహ్న మార్తాండుని
ఆగ్రహజ్వాలలో
ఆసరా అందించి
సేద దీర్చే ప్రకృతమ్మ ఒడి
సకల జీవులకూ
సాంత్వన దొరుకుతుంది అక్కడ
అదే చెట్టు నీడ.

**-కనపర్తి లక్ష్మయ్య**

### ప్రాణదాత వృక్షఛాయ

మాడుతున్న ఎండలో
మాసిన ఆశలతో
ఓదార్పునై ఒదిగేవు
ప్రాణదాతవైన నీవు
ఆశ్రయం, చెట్టు నీడ!
ప్రకృతి ప్రసాదించిన వరం.
అలసిన దారి
బాటసారికి చల్లని ఊపిరి
పశుపక్షాదులకు
పసిడి కిలకిలల సవ్వడి
నీ కొమ్మల చాటున
చిందులు వేసే చిరుగాలి
మనసుకు పంచేను
అద్భుత ప్రశాంతి.
కాంక్రిటు జంగల్‌లో
కాలుతున్న నగరంలో
హాయిగా సేదతీరగా
నీ కింద చేరేము మేము.
పల్లెటూరి పందిరివై
కబుర్ల తోరణమై
బాల్యం ఆడిన బొంగరాల నేల
పెద్దల విశ్రాంతి కేంద్రం.
నువ్వు కేవలం నీడ కాదు
జీవన నాడివి
కార్బన్‌ను పీల్చి
ఊపిరిని ఊదే ప్రాణం.
భూమికి కవచమై
నేల కోతను నివారించే శక్తి
భువి లోతుల జలధారవై
జీవరాశికి నీవే కల్పవృక్షం.
నరికివేత బాధతో
నీ విలువ మరుగున పడినా
నీ ప్రాముఖ్యత తరిగిపోని సత్యం.
కలిసికట్టుగా
ఒక మొక్కను నాటుదాం
పదిలపరుద్దాం
రాబోవు తరాలకు
పచ్చని పర్యావరణాన్ని అందిద్దాం.
నువ్వు కేవలం ఆశ్రయం కాదు
జీవితానికి సంకేతం
ఓదార్పు, ఆశ, అమృత జీవనం నీవే.
చెట్టు నీడలో
నిత్యం చల్లదనాన్ని పొందుదాం
ప్రకృతిని ఆరాధిద్దాం
దానిని కాపాడుకుందాం!.

**-విజయలక్ష్మి వడ్డేపల్లి**

### భాష్పోత్సేకం

తరువు ఉంటేనే తరువు ఛాయ
వనమహోత్సవ వేళ
చెట్ల నీడ ఎంతో
నీడనిచ్చే చెట్టు
రోడ్లకు ఇరువైపుల
అశోక చక్రవర్తి సంక్షేమం
రోడ్లకు ఇరువైపుల చెట్లు నాటెగా
చెట్ల చెంత చేమ
భాష్పీభవనంతోనే
మండు వేసవిలో
చల్లని చెట్టనీడ
చెట్లనీడకు చేరగానే
సేదదీర చెట్లు చెమర్చు
నీరు భాష్పోత్సేకంతో
వేసవిలో
మర్రిచెట్టు నీడ మహిమాన్వితం
తాపం తీర్చగా
మొక్కలన్నింట భాష్పోత్సేకం
నీటి ఆవిరితో
చల్లదనం చెట్టునీడన!.

**-లక్ష్మారెడ్డి పసుల**

### వీడుకోలు వేళ

చదువులమ్మ చెట్టు నీడ లో
వీడ్కోలు సమయం
సమీపించిన వేళ
కలిసి చదువుకున్న
చెలిమి జంటలు
కలబోసుకున్నాయి
జ్ఞాపకాల మధురిమలు!.
విరిగె కనుబొమ్మల
మన్మథ విల్లులు
విరిసె కన్నుల
నల్లకలువల దొంతరలు.
వెతుకుచు
అటునిటు కలయతిరిగే
ఓరచూపుల విసిరే వలలు
సూటిగా తాకగా చిక్కెను
చిక్కని తపనల తలపులు!.
దాచుకున్న భావనలు బయలుపడి
ఊరెను మాటల తేనెల ఊటలు
దాగిన చిలిపి ఊసులు ఆడెను
కోతికొమ్మచ్చి ఆటలు!.
స్థిరమైన భవిష్యత్తుకై
పక్కా ప్రణాళికలు వేసుకుని
ఆశలు మోసులెత్తగా
మరల తిరిగి కలుసుకుందామనే
కొండంత నమ్మకంతో
చేతులు కలుపుకుని
భరోసా కలిగించు స్పర్శతో
నొక్కుచు
వీడి వెళ్లలేక వెళ్ళుచు
వీడి తమ తమ నెలవులకు
దారి పట్టారు!.

**-చంద్రకళ దీకొండ**

### చెట్టునీడ కరువాయె

ఓ బాటసారి
అలసి సొలసిన
బడలికల
తనువుకు కొలది సేదతీర్చ
వెతికి వేసారినా
చెట్టునీడయే దొరకదాయె
బెట్టు చేసిన నాగరికత
వికాసాల పేర
రహదారులు భవనాల
నిర్మాణాల నెపంతో
రహదారి కిరువైపులా
విశాల బాహువులు చాచి స్వాగతించే
వృక్షరాజాల ఆతిథ్యమే ఆతిథ్యం
పచ్చని తోరణాల
ఫలపుష్ప పక్షుల
కిలకిలరావాల
ఎండవానల బారినుండి
రక్షక చల్లని గొడుగు పట్టి
సేదతీర్చే చెట్టునీడలే
కనుమరుగాయె
అరుదాయె.
అదేమి దౌర్భాగ్యమో
అమానుషంగా
హత్యల పాలాయె
ప్రాణవాయువులొసగే
పవన కొలనులు
మూగజంతువులు
బాటసారులు
స్వేచ్ఛా స్వతంత్రాల
సహజీవన కేంద్రాలు
చెట్టునీడన సేదతీరే ప్రాణులను
క్రూరమృగాలు, విషసర్పాలు
హాని చెయ్యజాలవు.
అది ఆ చెట్టునీడ మహిమ.
వాటినే త్యజించిన
మూర్ఖ మానవుడు
కృత్రిమ సౌకర్యాల మోజులో
ప్రకృతి సౌందర్యాలను
నాశనం చేస్తూ
వినాశాల కేగుతున్నాడు.
చరిత్రలో అశోకుడు
రహదారికి ఇరు ప్రక్కల చెట్లను
నాటించాడు
మరో అశోకుడు జన్మించాలని
వేడుకోరా ఓ బాటసారి.
చెట్టునీడ నీకు
తోడై నిలవాలని కోరుకో
నమ్ముకో
వృక్షో రక్షతి రక్షితః,

**-రాజప్ప**

# ఆదాయ పన్నులతోనే దేశ సమగ్రాభివృద్ధి !

24 జూలై 1860 రోజున 'సర్ జేమ్స్ విల్సన్' చొరవతో తొలిసారి ఆదాయ పన్ను విధానాన్ని ప్రారంభిం చబడి, దేశ ఆర్థిక చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచి పోయింది. వ్యక్తులు, వ్యాపార సంస్థల ఆదాయాన్ని బట్టి ప్రతి ఆర్థిక సంవత్సరం నిర్ణీత పన్నులను వసూలు చేయడాన్ని "ఆదాయ పన్ను" లేదా "ఇన్‌కమ్ ట్యాక్స్" అని అంటున్నాం. తర్వాత ఆదాయ పన్ను వసూళ్ల విధానంలో విప్లవాత్మక మార్పులు రావడానికి 1860 ఆదాయ పన్ను విధానం పునాదిగా "ఇన్‌కమ్ టాక్స్ చట్టం, 1922" అమలులోకి వచ్చింది. 1922 నాటి చట్టం ద్వారా ఒక పటిష్ఠ పరిపాలనా పద్ధతి ప్రకారం ఆధునిక రీతుల్లో భారతీయుల నుంచి ఆదాయ పన్నులను వసూలు చేయడం కొనసాగుతోంది. భారత ప్రభుత్వం 1924లో తీసుకువచ్చిన "సెంట్రల్ బోర్డ్ ఆఫ్ రెవిన్యూ చట్టం" రావడం, చట్టబద్ధమైన ఆదాయ పన్ను అధికారుల (ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్స్) సమూహం ఆదాయ పన్ను శాఖలో భాగం అయ్యారు.

## ఆదాయ పన్ను శాఖలో విప్లవాత్మక మార్పుల చరిత్ర:

1946లో గ్రూప్ - ఏ స్థాయి అధికారులను నియమించి వారికి బొంబాయి, కలకత్తాల్లో శిక్షణ ఇవ్వడం జరిగింది. 1957లో "ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ" స్థాపనతో ఆదాయ పన్ను వృత్తిలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఏర్పడింది.

1981లో ఎలక్ట్రానిక్ చాలాన్ విధానం, కంప్యూటరైజేషన్ ప్రక్రియ ప్రవేశపెట్టబడింది. 2009లో బెంగుళూరులో "సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్" రావడంతో ఒకే సారి అనేక ప్రక్రియలు చేయడం సుసాధ్యం అయ్యింది. 2014లో జాతీయ స్థాయిలో ఆదాయ పన్ను వెబ్‌సైట్ రావడం, 2020లో ''వివాద్ సె విశ్వాస్ స్కీమ్'' ప్రవేశపెట్టడంతో పలు సమస్యలకు పరిష్కారాలను సులభంగా ఇవ్వడం జరుగుతున్నది. 2021లో ఈ-ఫైలింగ్ పోర్టల్‌ను ప్రారంభించారు.

## సాలీనా రూ: 20 లక్షల కోట్ల పన్ను వసూళ్లు:

నేడు అర్హత కలిగిన పౌరుల నుంచి వేతనాలు, గృహ ఆస్తులు, వ్యాపారాలు, వృత్తులు, క్యాపిటల్ గేయిన్స్, ఇతర మార్గాల్లో ఆదాయాల నుంచి నిర్ణయించిన నిష్పత్తిలో ఇన్‌కమ్ టాక్స్ వసూలు చేయడం జరుగుతోంది.

ఒక నాడు భారత కేంద్ర ప్రభుత్వం సాలీనా రూ: 30 లక్షల పన్ను వసూళ్లు నమోదు కాగా, 2023-24లో రూ: 12.01 లక్షల కోట్లు, నేడు దాదాపు రూ: 20 లక్షల కోట్ల ఆదాయ పన్నుల వరకు వసూలు చేసే స్థాయి వచ్చింది. దేశాభివృద్ధి, దేశ భద్రత, పౌర సేవలు, ఆర్థికాభివృద్ధి రంగాలకు ఈ ఆదాయ పన్ను వసూళ్లను ఖర్చు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నది.

నేడు దేశవ్యాప్తంగా 165వ జాతీయ ఆదాయ పన్నుల దినోత్సవం జరుపుకుంటున్న వేళ, ప్రతి పౌరుడు తమ తమ ఆదాయాలను బట్టి పన్నులను విధిగా చెల్లించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

నాగరిక పౌర సమాజం ఆదాయ పన్నులను స్వచ్ఛందంగా చెల్లించాలి. ఆదాయ పన్ను శాపం కాదని, అది ఒక బాధ్యత అని తెలుసుకోవాలి. నేటి ఆధునిక పౌర సమాజంలో ఆదాయ పన్నులను ఎగవేత ఓ గర్వంగా తీసుకోబడుతున్నది. ఏ ఇతర ప్రభుత్వ రంగ విభాగంలో లేని నేరస్థులు నేడు ఆదాయ పన్నుల శాఖలో ఉన్నట్లు విశ్లేషిస్తున్నారు. ఒక దేశభక్తి కలిగిన పౌరుడిగా అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన వార్షిక ఆదాయాన్ని బట్టి పన్నులు చెల్లించడానికి ముందుకు రావాలని కోరుకుందాం, ఆదాయ పన్ను చెల్లించే పౌరులను మనసుల్లోన సన్మానించుకుందాం.

(24 జూలై "జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం" సందర్భంగా)

**-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మాతృభాషను సంరక్షించే ప్రవాసీలను గౌరవించుకోవాలి

**-కార్మిక శాఖ మంత్రి వివేక్**

**తెలుగు వర్సిటీ-2024 ప్రతిభా పురస్కారాల ప్రదానం**



పురస్కార గ్రహీతలతో మంత్రి వివేక్, ఆచార్య నిత్యానందరావు, వ్యాసకృష్ణ, ఆచార్య కోట్ల హనుమంతరావు, రింగు రామ్మూర్తి తదితరులు

విదేశాల్లో స్థిరపడినప్పటికీ మాతృ భాషను సంరక్షిస్తున్న తెలుగువారిని గౌరవించుకోవాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం శనివారం ప్రతిభా పురస్కారాలు-2024( ప్రదానం చేసింది.

ఈ వేడుకకు హాజరైన మంత్రి మాట్లాడుతూ పలువురు ప్రముఖులను గుర్తించి పురస్కారాలు అందించడం గొప్ప విషయమన్నారు. పురస్కారాల నగదు పారితోషికాన్ని పెంచడానికి క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ ఎండీ (ఉగాండా) వ్యాస కృష్ణ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రింగురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పురస్కారాలు అందుకున్నవారు

డా॥ యాకూబ్(కవిత్వం), డా॥ఎం.ఎ. శ్రీనివాసన్ (పరిశోధన), ఎల్. నరేందర్( చిత్రలేఖనం), బైరోజు చంద్రశేఖర్ (శిల్పం), డా॥ఆర్. ప్రసన్నరాణి (నృత్యం), డా॥ రాధా సారంగపాణి (సంగీతం), కె. కైలాష్ (పత్రికా రంగం), దుప్పల్లి శ్రీరాములు (నాటక రంగం), గజవెల్లి సమ్మయ్య( జానపద కళారంగం), ఆముదాల మురళి (అవధానం), డా॥పులిగడ్డ విజయలక్ష్మి (ఉత్తమ రచయిత్రి) పోల్కంపల్లి శాంతాదేవి (నవల), పక్షాన ఆమె కోడలు సంధ్యలకు రూ.20,116 నగదుతో పాటు శాలువా కప్పి అభినందన పత్రాలు అందజేశారు.

# పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి



'సమాజానికి బహిరంగ లేఖ' పుసకాన్ని ఆవిష్కరిస్తున్న యాకుబ్, వేణుగోపాల్, గుడిపాటి, ఏకే.ప్రభాకర్, పసునూరి రవీందర్ తదితరులు

ప్రభుత్వం పుస్తకాలను కొనుగోలు చేయాలని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని గ్రంథాలయ సెస్‌ను వాటి అభివృద్ధికి కేటాయించాలని, పాఠశాలల్లో గ్రంథాలయాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు రాష్ట్రాల్లో మరో గ్రంథాలయ ఉద్యమాన్ని ఐక్యంగా రూపొందించాలనే ఎజెండాతో మొదటి ప్రయత్నంలో భాగంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మంచి పుస్తకం నరేష్, కవి యాకుబ్, ఎం.వేణుగోపాల్, గుడిపాటి, ఎకె.ప్రభాకర్, పసునూరి రవీందర్, జి. ఉమామహేశ్వర్, రమేష్‌బాబు, కందుకూరి రాము, గిరిజ, కస్తూరి ప్రభాకర్, జలాది సుధీర్, మోత్కూరి శ్రీనివాస్, వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు. భావితరాల భవిష్యత్ కోసం తెలుగు రాష్ట్రాల్లో మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు, నేటి తరం పిల్లలు పుస్తకాలు కొనడం, చదవడం లేదని, గ్రంథాలయాలకు వెళ్లడం లేదని అన్నారు. శుభకార్యాలలో పుస్తకాలు ఇచ్చే సంస్కృతి పోయిందన్నారు.

పిల్లలతో పుస్తకాలను పరిచ యం చేయాలని, పుస్త సంస్కృతిని పెంచే కార్యక్రమం చేపట్టాలన్నారు. తెలంగాణ గ్రంథాలయ ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసుకుని జిల్లాలు, గ్రామస్థాయి వరకు మరో గ్రంథాలయ ఉద్యమం విస్తరింపచేయాలన్నారు. ఈ సందర్భంగా మంచికంటి రచించిన సమాజానికి **' సమాజానికి బహిరంగ లేఖ'** పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# జయరాజ్‌కు దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం



జయరాజ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య మాఢభూషి శ్రీధర్ తదితరులు

దాశరథి సాహిత్యం మనలో ఎప్పుడు చైతన్యం నింపుతూనే ఉంటుందని, ప్రజల కోసం సాహిత్యాన్ని అందించిన గొప్ప వ్యక్తి దాశరథి కృష్ణమాచార్య అని ఆచార్య మాడభూషి శ్రీధర్ అన్నారు. మా భూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చింతలకుంట వాసవి శ్రీ నిలయం బాంకెట్ హాల్లో నిర్వహించిన దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలకు ఆయన హాజరై కవి జయరాజ్‌కు డా॥దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు బల్లేపల్లి మోహన్, దాశరథి తనయుడు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అదనపు జడ్జి మురళీమోహన్, మాభూమి సమన్వయకర్త గొర్రెపాటి నరసింహ ప్రసాద్, నాగిరెడ్డి, ఉదయ్‌శంకర్, రఘునందన్, కేశవరావు, మూర్తి, శరణ్య, సరస్వతి అలివేలు మంగ, భవానీ, వనజా పాల్గొన్నారు.

## కవికి కవియే శత్రువు

ఎవరు
కవిగా రచయితగా జన్మించరు
సమాజమే
ప్రత్యక్షంగానో పరోక్షంగానో
కారణ'భూత'మై
ఒక మనిషికి కవిగా పుట్టుకనిస్తుంది
పురుషులందు పుణ్య పురుషులు
వేరన్నట్లు కవులయందు
ఉత్తమ కవులు!
హలం లాంటి కలం పట్టి
అహోరాత్రులు
పరిశీలనాత్మక అధ్యయనం చేసి
మెదడును మదిస్తూ
కవిత్వాన్ని పండిస్తారు,
అసలు సిసలైన కవి
కంటి నిండా నిద్రపోడు
కడుపునిండా తిండి తినడు
అయిన బట్ట కట్టడు
అన్యాయాన్ని సహించడు
ఎప్పుడు
ఆలోచనల్లో మునిగి తేలుతుంటాడు,
ఎప్పుడు
ఆశల పందిరికి
అక్షరాలను వాక్యాలుగా చేసి
అల్లుతుంటాడు
కష్టజీవి కవిత్వం రాసి
లాంచనాలకు అర్హుడవుతాడు
శ్రమజీవి కథ చెప్పి
పుస్తకానికి చిత్తరువు చేస్తాడు .
కవులకు కవులు
రచయితలకు
రచయితలు మాత్రమే పరిచయస్తులు
వీళ్లది అదో ప్రపంచం !
ఇప్పుడు
కొందరు
పుట్టుకతో అనుకరణ కన్నె కవులు
మరికొద్ది మంది
పరిణితి చెందిన అనువాద కవులు
ఇంకొంత మంది
సిఫార్సు పైరవీ కవులు
కొంతమంది
చేయి తిరిగిన సిజేరియన్ కవులు
తతిమ్మమంది
పలుకుబడి గల సరోగసి కవులు.
సమాజంలో
మార్పు కోసమనుకుంటూ...
తలో కవిత రాస్తున్నా
కథ చెబుతున్నా
ఉపన్యాసమిస్తున్నా
కవికి కవియే మేక వన్నె శత్రువు !.



**-జిందం అశోక్**
సెల్:8978532225

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

### వేల గ్రంథాల నాల్క ?!

నాడు నా నాల్క వేమన
ఆది కవుల పద్యాలతో తాళపత్రం.
నేడు ఆధునిక వచన రచనల
మహా గ్రంథరాజం!
మీరేది అడిగిన వెంటనే
తడితడిగా ఆర్ద్రంగా చెప్పేస్తుంది!.
నాల్క పై ఎన్ని వేల గ్రంథాలో
జ్ఞాపకంగా వల్లె వల్లెగా వల్లెయే మరి
మహా మేధావిగా!
బెత్తెడై నాల్కయే ఏమీ తెల్వనట్టు!
రుచులు మాత్రమే
తెలుసు అనుకుంటాం!
కాని పెద్ద కేటలాగే మన నాల్క!!
సజీవ గ్రంథాలయం !!

**-కందాళై రాఘవాచార్య**
8790593638

### నగరం విస్తరిస్తుంది

ఒకప్పుడు నగరం చుట్టు.
మానవ జీవన జీవనోపాధి.
ఉత్పత్తుల జీవవైవిధ్య సమ్మేళన.
ప్రాకృతికసౌందర్యం.
మనసును పెనవేసుకుని.
స్వాగతాలుపలికే.
పరిమలపు పూల వనాలు
నోరూరించి గుటకలు వేయించే
తీపి రుచుల పండ్ల తోటలు.
పుష్టి పోషక పంట సిరుల
ధాన్యపురాశులను.
పైరు పొట్టలో నింపుకొని
గలగల స్వరాలతో రాగాలు.
పలికే ప్రకృతి హారాలు.
పల్లెలు పట్టణం తో
వియ్యమొంది.
పంట భూములను.
బీడు మైదానాలుగా మార్చి.
మింటిని తాకేంత బహుళ.
అంతస్తుల మేడలు నిర్మించు.
కుంటున్నవి.
నగర వీధులన్నీ కాంక్రీట్.
పొరలు పొరలు పర్చుకుని.
వాన లెస్సగా కురిసిన.
నగరం దాహార్తిని
తీర్చనంటుంది
మెరిసే అద్దాల మేడలకు మురిసి.
మట్టిని ఈసడించుకునే.
నవ నాగరిక తనం.
మనిషి ననే సంగతే మర్చి
బాంధవ్యాలకు నీళ్లువొదిలి
కాసుల కోసం ఆశపడి
భుక్తికి మూలమైన అమ్మను
అమ్మకానికి పెట్టి.
ఆగమాగమైన కుటుంబాలు.
పల్లెలు రూపం.
మార్చుకున్నాయి.
పట్నంతో చేతులు కలిపి.
ఓదార్చటానికి జీవవైవిద్యాలే.
కనుమరుగవ్వటానికి మనిషి
అత్యాషే.
సర్వం నాదేననే మనీ "షి"
తనం.
పచ్చదనాన్ని పర్యావరణాన్ని.
తుడిచేసిన నేలన చినుకు.
చినుకు ఇనకనంటుంది.
ఇంటి కొక్క బోరు పొక్క వేసిన.
చుక్కనీరు రానంటుంది.
ఆశలు ప్రేరేపించుకున్న.
మనసులు తృప్తి పడనంటున్నవి.
సంతోషాలు మచ్చుకైన.
కనిపించని నగర జీవితాలు నటిస్తవి.
మానవ మూలాలు ఒక్కటైన.
ముచ్చటించుకునే బంధాల
నడుమ పైస ఆశ జొరబడి.
అత్యాశ సెగలు రాజేసుకుని
మాట కరువై,బంధం బరువై,
ఆస్తిహక్కు వివాదాలలో.
బందూకులు, బరిసెలు
పెనుగులాడుతున్నవి.
బ్రతుకు విలువ తెలుసుకోక.

**-యరకల యాదయ్య.**
9866468979.

### జనం వనం

జనం జనం మనం మనం
మనం మనం ఈ జగం
ఈ జగం జన వనం!.
రోజూ వికసించే ఈ వనం
తరతరాల నర సదనం
తరగనంత వృద్ధి దిన దినం!.
రణం రణం జన రణం
వరనం వరనం జనావరణం
జన వృద్ధి తో రణం!.
యుగ యుగం ఈ జగం
పెత్తనం జెండాల తోనే
జగడం జగడం జనం సగం!.
మరణం మరణం ఓ రణం
మరణంతో మనిషి రణం
ఆయువు పెరిగిన శుభ తరుణం!.
యుక్తి యుక్తి సర్వశక్తి యువత
అభివృద్ధికి భవిత
సంస్కరణ సాంకేతికతో నవ్యత!.
పెరిగిన జనం వరం వరం
కరం కరం కలిపితే లేదు కలవరం
అందరికీ మనందరికీ శుభకరం!.

**-పట్లోళ్ళ బక్కారెడ్డి**
9705315250

### వీడ్కోలు

ఉద్యోగానికి
వీడ్కోలు పలికాక
శరీరం బద్ధకానికి
స్వాగతం పలుకుతుంది
సమయానికి
అందే టీ కాస్త
ఆలస్యమవుతుంది
రోజు పెట్టే భోజనంలో
కొంచెం కొంచెం ప్రేమ తగ్గి
రుచి పూర్తిగా కోల్పోతుంది
ఆలోచించాలి గాని
వీడ్కోలు
కృత్రిమమైనదేమీ కాదు
సహజమైనదే
అయినా వీడ్కోలు ఉద్యోగానికి కానీ
జీవితానికి కాదుగా
ఆస్వాదించే మనసునిండాలి గాని
జీవితమెప్పుడూ
రుచిగానే ఉంటుంది.
జీవితమంతా
నువ్వు అనుకోవడంలోనే ఉంది
ఎలా అనుకుంటే అలా
రోండా బర్న్ " రహస్యం" ఎవరైనా
అప్లై చేసుకోవచ్చు మనసుండాలి
కానీ మలిదశ కూడా
మహాద్భుతంగా వెలుగొందుతుంది.
ఆలోచనుండాలిగానీ
నీ జీవితానుభవంతో
కొత్త తరానికి
నువ్వు దారిదీపమవ్వచ్చు
కవిగానో రచయితగానో
పక్కానికొచ్చి
చెడు ఆలోచనలనుండి
సమాజాన్ని మంచివైపు
దారి మళ్లించవచ్చు.
తపన ఉండాలి కానీ
రక్తముడికేదాకా
వెన్నుపూస వంగేదాకా
ఆలోచనల తరంగాలతో
ప్రతిరోజూ నువ్వు
కొత్తగా ఉదయించవచ్చు
వీడ్కోలు ఉద్యోగానికే కానీ
జీవితానికి కాదు

**- ఎన్.నరేశ్ చారి**
9701334516

### అంతం లేని అవినీతి

రాకాసి అవినీతి రాజ్యమేలుతోంది
కోట్లకు పడగలెత్తి బుసలుకొడుతోంది
అంతం లేని అవినీతి!!
ప్రజాధనం లాకర్లలో
నిక్షిప్తం అవుతోంది
పట్టుకుంటే పదుల కోట్లు
లెక్కబెడితే అంతులేని సంపదవస్తోంది
అంతం లేని అవినీతి!!
ఒక్కో అధికారి వద్ద వేలకోట్లు
పోగ లెక్క లేని
కట్టలకొద్దీ దొరుకుతోంది
అంతం లేని అవినీతి!!
గుట్టలుగా బంగారు వెండి వజ్రాభరణాలు
కుబేరుడే ఆశ్చర్య పోయే ఐశ్వర్యం
అంతం లేని అవినీతి!!
ఔరా ఇంతటి ధన పిశాచి ఆవహించి
అవినీతి పురివిప్పి అలిసిపోని నాట్యం
అంతం లేని అవినీతి!!
అవినీతి మహమ్మారి జాఢ్యం
అది కాస్తా క్యాన్సర్ లా విస్తరిస్తోంది
అంతం లేని అవినీతి!!
అవినీతి సొమ్ముతో అందలమెక్కుతూ
ఆర్భాటాల సోకులతో
ఔరా అనిపిస్తోంది
అంతం లేని అవినీతి!!
ఇందని అందని సందేహమువలదు
ఎందెందు వెతికి చూసిన అందందే
అవినీతి విశ్వరూప సందర్శనం
అంతం లేని అవినీతి!!

**-విఠల్ మల్లేశం పెద్దిగారి**
9440686473

### ముద్దు-ముచ్చట

ముద్దు ముద్దుగాను ముసలోళ్ళు కూర్చుండి
ముచ్చటించుకొంద్రు మురిపముగను
వయసు మీరినాక వారికి వారెనోయ్
కనుము వినుముదారి కందుకూరి !

పైన చెట్టు, గట్టుపై కూర్చొనున్నారు
కాలు చాపినారు కాటి దిక్కు
అంటు, మొక్కు కుంటు ఆకాశమే దిక్కు
కనుము వినుముదారి కందుకూరి !

**-కందుకూరి శ్రీరాములు**
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్
సికింద్రాబాద్

# సూర్య దేవుని చురుకు చూపుల దాశరథి!



-డా॥మామిడి హరికృష్ణ

**"ఎండాకాలం కొండల మీద అరణ్యాలలోని చెట్లు రాచుకుని దావాగ్ని ఉద్భవిస్తుంది. ఎవరు నిప్పు వెలిగించ నక్కరలేదు. ఉద్యమాలు అలాగే వస్తాయి"**

ఈ మాటలు దాశరథి వరంగల్ నుంచి ప్రచురితమయ్యే 'జనధర్మ' 1969 మార్చి నెల పత్రికలో "నేను– నా రచన" అనే శీర్షికలో ప్రస్తావించారు. ఇవి సర్వకాల, సర్వావస్థలలోనూ సత్యమని ప్రపంచంలోని ఎన్నో ప్రజా పోరాటాలు నిరూపించాయి. తెలంగాణ ఉద్యమం కూడా అంతే సహజంగా వచ్చింది. దోపిడీకి, నియంతృత్వానికి, నిరంకుశ పాలనకు, అణచివేతకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం, స్వేచ్ఛ కోసం, కట్టు బానిసత్వం నుంచి విముక్తి కోసం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిన సందర్భంలో కాలం సృష్టించిన ధిక్కారస్వరం అక్షర శరధి, కవితా రథి - దాశరథి!

ఆనాటి తెలంగాణ పాలనా యంత్రాంగంలో జాగీర్ అనేది ఒక ప్రాదేశిక ప్రమాణం. అలాంటి ఎన్నో జాగీరుల సమాహారమే హైదరాబాద్ రాష్ట్రం! అలాంటి ఒక జాగీరు "గార్ల"! ఈ జాగీర్ పరిధిలో బయ్యారం, రంగాపురం, పోచారం, ముల్కనూరు, దుబ్బగూడెం, కొత్తపేట, పొన్నగంటి గండి వంటి ఎన్నో గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాల లోని సమస్త శాంతిభద్రతలు, పన్నుల వసూళ్లు, భూమి పరమైన హక్కులు, రైతు కూలీలకీ పనులు ఇవన్నీ చూసే బాధ్యత జాగీర్ అధినేత అయిన జాగీర్దార్ ది. అయితే గార్ల జాగీర్దారు అప్పట్లో ఎక్కువగా రాజధాని నగరంలోనే ఉండేవారు. ఆయన తరపున రెవెన్యూ, పోలీసు అధికారులు స్థానికంగా తాము వసూలు చేసిన పన్నుల లోని డబ్బును ఏటేటా జాగీర్దార్ కు అందజేసేవారు. ఆ క్రమంలో వారు ఎలాంటి అత్యాచారాలు, అరాచకాలు చేసిన ఆయన అంతగా పట్టించుకునే వాడు కాదు.

ఈ విషయాలన్నీ దాశరథి **"జాగీరు ఇలాకాలో స్వాతంత్ర పతాక"** అనే శీర్షిక పై మద్రాసు ఆకాశవాణి కోసం చేసిన ప్రసంగంలో వెల్లడించారు. ''జాగీర్ లోని పోలీసు అమీన్ అనుభవించే భోగభాగ్యాలు ఈనాడు ఏ ఉన్నతాధికారికి లభ్యం కావు. వెట్టిచాకిరికి జాగీర్లు పెట్టింది పేరు. అలాంటి రాక్షస రాజ్యంలో బ్రతకవలసిన దౌర్భాగ్యం వేలాది ప్రజలతోపాటు నాకూ కలిగింది. అక్కడి ఘోరకలి ని చూసి నా హృదయం ఆక్రోశించింది. నాజీలు, ఫాసిస్టులు ఎలా ఉంటారో నాకు అర్థమైంది. జర్మనీ, జపాన్, స్పెయిన్ లలో అలనాటి కర్కోటకుల ప్రతిరూపాలే ఇక్కడి అధికారులు. అప్పుడప్పుడే నేను యవ్వనదశలో అడుగుపెడుతున్న రోజులు. రాజకీయాల్లోనూ, సాహిత్యంలోనూ నేను విద్యార్థిని. వ్రాతలు, కూతలు కాక చేతలు మాత్రమే జాగీర్ లోని అమానుషత్వాన్ని నిర్మూలించగలవనే నిర్ణయానికి ఆనాడు వచ్చాను" అని తాను ఎందుకు నిజాంకు వ్యతిరేకంగా పోరాటంలోకి దిగాల్సి వచ్చిందో ఆ నేపథ్యాన్ని వివరించారు.



అలా తన ప్రజా ఉద్యమానికి గార్ల ప్రధాన కేంద్ర మైంది. అక్కడి నుంచి మొదలైన ఆయన ధిక్కార స్వరం కవితల రూపంలో, ప్రజా చైతన్య యాత్ర ల రూపంలో, ప్రజా సంఘాల సమావేశాల రూపాన్ని సంతరించుకుంది. అదే సందర్భంలో గార్ల జాగీరు లోని గ్రామాలలో కాలినడకన తిరుగుతూ, కోయగూడెం లలోని ప్రజల్లో చైతన్యం కోసం ఆనాడు ఆ ప్రాంతంలో విస్తృతంగా ప్రజలను భయపెడుతున్న మలేరియా వ్యాధి ని ఆధారంగా చేసుకొని ఒక ఆకర్షణీయ మైన, ప్రభావవంతమైన నినాదాన్ని దాశరథి ప్రయోగించాడు. **''మలేరి యాకు క్వినైన్ మందు.. మధ్యయుగాల జాగీర్దారీ విధానానికి మన తిరుగుబా టు మందు!"** అని నినదించారు. ఈ నినాదం అప్పట్లో కోయ గూడాలలో ఎంతో ప్రచారాన్ని పొందింది. గంటలకొద్దీ ప్రసంగాలు, వేలాది మాటలు చేయలేనంత ఆలోచనని ఆనాటి నిరక్షరాస్య ప్రజలలో రేకెత్తించ గలిగింది. ప్రజా ఉద్యమ భాగ స్వామిగా ఆయన ఆ తర్వాత ఆంధ్ర జన సంఘం లో, ఆంధ్ర మహాసభలో, కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర నిర్వహించినప్పటికీ కవిగా, ఆయన రాసిన ప్రతి అక్షరం ఆయనలోని అమితమైన ప్రజా భక్తిని, తెలంగాణ పట్ల అనురక్తిని, మానవత్వం పట్ల నిబద్ధత ని, సమానత్వం కోసం ఆయన ఆక్రోశాన్ని ఆయన కవితలు వ్యక్తీకరించాయి.

**"ప్రజా ఉద్యమాన్ని, ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని తన కవితాక్షరాలలో పొదిగి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన మహాకవి దాశరథి!"**

కాగా ఆయన కవితలు ప్రకృతిని, ప్రపంచాన్ని, ప్రజలని,పోరాటాల ని భావోద్వేగాల ని, మానవ సంబంధాలని, విప్లవాన్ని, తిరుగుబాటుని కవితా వస్తువులుగా తీసుకొని ఎన్నో రూపాలలో మనకు సాక్షాత్కరించాయి.

ఆయన రాసిన "అమృతాభిషేకం" ఖండకావ్యం లో ఇలాంటి ఎన్నో భావనలు తొలుత మనకు కనిపిస్తాయి. ఈ కావ్యానికి రామారావు ఎడిటర్ కాగా, ఇది 1953 ఏప్రిల్లో ప్రచురించబడింది. మొత్తం 17 కవితలున్న ఈ కావ్యాన్ని దాశరథి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కి అంకితం ఇచ్చారు. ఇందులోని **'సుప్రభాతం'** అనే శీర్షిక లోని కవితలో **"ఉదయాద్రి భుజమెక్కి ఒకడు నవ్వెను చూడు/ భూ దివమ్ములు వెలుగుపూలు పూయ"** అని ప్రాతఃకాలపు సన్నివేశాన్ని అత్యంత రమణీయమైన వర్ణనతో చెబుతూ పూర్వకవుల సంప్రదాయ ప్రాకృతిక వర్ణన ని తన కావ్యంలో చెబుతూనే సూర్యుడిని ఒకడు అని **"మానుష ధర్మారోపణ"** చేసి ఆధునిక కవిత లోని సొబగును, ప్రాచీన పద్య సంప్రదాయంలో చక్కగా పొదిగే లాగా అక్షరాభిషేకం చేశాడు.

అలాగే ఇదే కావ్యంలోని "చీకటి నటి" అనే శీర్షిక లోని కవితలో **"తెరలు తెరలుగా చీకటి/ దిగెను జగతి నడినెత్తిని/ ఎంతని పుట్టించగలను/ ఈ దీపపు చిరు వత్తిని?"** అని అన్యాపదేశంగా ఎంతో సంకేతాత్మకంగా,ప్రతీకాత్మక భావజాలం తో ఈ కవితని దాశరథి రాశాడు. చీకటి అజ్ఞానానికి, అపనమ్మకానికి, ప్రతికూలాత్మక మనోభావాలకు ప్రతీక అయితే దానిని పారద్రోలకలిగినది దీపం మాత్రమే. జ్ఞానం, ఆలోచన, ఆశ మాత్రమే. అయితే అలాంటి సానుకూల దృక్పథంతో కూడిన ఆశా దీపాన్ని మనలో కూడా రాజేయకుండా ఎంతకాలం బయటి నుంచి వెలిగించగలం అని ఈ కవిత లో ఆయన చెబుతారు.

ఇక ఆయన రాసిన కావ్యాలలో ప్రఖ్యాతి గాంచిన **"రుద్రవీణ"** కావ్యాన్ని "నా తెలంగాణ కు" అని అంకితం చేయడం ద్వారా తన జన్మ భూమి పట్ల ఆయనకున్న అచంచల భక్తిని చెప్పకనే చెప్పారు. అంతేగాక **"వీర తెలంగాణ"** అనే శీర్షిక గల కవితలో తెలంగాణలో ఉండే పోరాట స్ఫూర్తిని, ధైర్య స్థైర్య, త్యాగ,వీర లక్షణాలను **"తెలంగాణమ్మున గడ్డిపోచయును సంధించెను కృపాణమ్ము"** అని కీర్తించాడు. అల్పమైనది అనుకున్న గడ్డి పోచ కూడా అణచివేతకు వ్యతిరేకంగా పదునైన ఖడ్గం గా మారుతుంది అనే విషయాన్ని ఈ కవితలో ఆయన వ్యక్తీకరించాడు.

అలాగే **"ముక్త భూమి"** అనే కవితలో నిరంకుశ పాలన నుంచి విముక్త మైన, తన జాతిని తన భూమిని చూసి సంబరపడుతూ **"రెండు వందల యేండ్ల చరిత్ర పుటల/ కప్పుకొని ఉన్న గాఢాంధకారమెల్ల /కొట్టుకొని పోయె, తూరుపు మిట్ట నుండి / పారి వచ్చిన వెలుతురు వాగులోన"** అని తెలంగాణలో వెలుగు ఉదయించింది, విముక్తి లభించింది, అణిచివేతకు చరమగీతం పాడింది అనే విషయాన్ని చెబుతాడు.

అలాగే తన గురించి, తనలోని భావనల గురించి 'సుప్రభాతం' అనే కవితలో "నీలి దారుల కాలుమోపిన సూర్యదేవుని చురుకు చూపులు, నావి!" అని స్పష్టం చేస్తూ ఈ మాటలు తాను ఒక్కరికే కాక ప్రపంచవ్యాప్తంగా ఉండే కవులందరి చూపులు గా అభివర్ణించాడు.

ఇక "మహాబోధి" అనే దీర్ఘ కావ్యంలో, తెలుగు నేలమీద బుద్ధుడి బోధనలు, బౌద్ధ మత ప్రభావం, ఆ క్రమంలో జరిగిన పరిణామాలన్నింటికీ తన ఊహలను, ఆలోచనలు, ప్రజల పట్ల తనకు ఉండే ఆశాభావాన్ని ఈ దీర్ఘ కావ్యంలో ఆయన వ్యక్తీకరించాడు. దీనికీ ఆనాటి మధ్యప్రదేశ్ గవర్నర్ డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రస్తావన రాయగా, దీనిని ఆనాటి హైదరాబాదు ప్రథమ ప్రజా ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుకు దాశరథి అంకితమిచ్చారు.

అలాగే **"జ్వాలా లేఖిని"** అనే కవితా సంకలనం లో 30 కవితలను రాసి ప్రచురించాడు. కాగా ఈ కావ్యాన్ని స్వాతంత్ర సమర యోధు లకు అంకితమిస్తూ "మృత్యు రాక్షసి కరాళ నృత్యానికి భీతిల్లని మృత్యుంజయ మూర్తులారా! మీకిదే నా ప్రేమాంజలి" అని సవినయంగా సమర్పిస్తాడు.

అలాగే "సాఖీ నామా "అనే పుస్తకంలో దాశరథి తాను రాసిన కొన్ని గజల్ లను, రుబాయిలను మనకు అందిసాడు. ఉర్దూ, పారశీక సంప్రదాయంలో పేరెన్నికగన్న గజల్, రుబాయీ ప్రక్రియలను తెలుగు సాహిత్యంలోకి పరిచయం చేసిన ఘనత దాశరథిదే!

పూర్వకవుల సంప్రదాయ పద్య సౌరభాన్ని కొనసాగిస్తూనే, ఆధునిక నవీన వచనానికి దారులు వేస్తూనే, మరొకవైపు ప్రపంచ సాహితీ పోకడల లోని ప్రక్రియలను తెలుగులోకి తీసుకువచ్చి, వాటికి సాహిత్య ప్రతిపత్తిని కల్పించిన ప్రయోగశీలి దాశరథి!

ఆయన "గుండెకు అండ "కవితలో **"నా గుండె కు/ నేనే అండను /నా ఆత్మకు/ నేనే కైదండను** "అనే వ్యక్తి ఆశ్రయ రీతిలో చెబుతూ, అది కవి భావన గానే కాకుండా,విశ్వమానవ స్ఫూర్తి గా చెబుతాడు. సమకాలీనంగా యువతరంలో ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న "స్వీయ ప్రేమ" అనే నవీన భావన ను ప్రస్తుతించే లా ఈ కవిత మనకు కనిపిస్తుంది.

మిర్జా గాలిబ్ గీతాలను తెలుగులోకి అనువదించడమే కాక, వాటి స్ఫూర్తి తో ఎన్నో గజల్ లు రాసిన దాశరథి

**"రమ్మంటే చాలు గానీ రాజ్యాలు విడిచి రానా! నీ చిన్ని నవ్వు కోసం స్వర్గాలు గడిచి రానా!"**

అని ఎంతో లలితంగా, సున్నితంగా, సుకుమారంగా తన హృదయంలోని మనోభావాలని తన ప్రేయసికి సమర్పించుకునేంత హృదయంగమంగా రాశా రు. గజల్ కవితా రీతిలో ఉండే నడకని, లయని, అక్షరాల పోహళింపు ని కలగలిపి, భావ పరంగా ఉండే సున్నితత్వాన్ని, సునిశితత్వాన్ని, ప్రియ త్వాన్ని ఇలాంటి ఎన్నో గజల్ లలో ఆయన అక్షరీకరి ంచారు. ఇక రుబాయిల పరంగా "రుబా "అంటే అరబిక్ భాషలో 'నాలుగు' అని అర్థం.రుబాం యిలో అందుకే నాలుగు పంక్తులు ఉంటాయి. దాంతోపాటు ప్రత్యేక ఛందస్సు, ప్రాస, అనుప్రాస కూడా ఉంటాయి. పర్షియన్ మహాకవి ఉమర్ ఖయ్యాం వల్ల, వాటిని ఇంగ్లీషులోకి అనువాదం చేసిన ఫిట్జ్ గెరాల్డ్ వల్ల ఈ ప్రక్రియ విశ్వవిఖ్యాతి సాధించింది. ఇలా ఖ్యాతిగడించిన రుబాయిల గురించిన అవగాహన హైదరాబాదులో ఆనాటి ప్రఖ్యాత ఉర్దూ కవి అంజాద్ హైదరాబాదీ ద్వారా తాను తెలుసుకున్నానని దాశరథి తన సాఖీనామ ముందుమాటలో చెప్పుకున్నాడు. ఈ రుబాయి ప్రక్రియ మెళుకువలను తెలుసుకొని తెలుగు సాహిత్యానికి దీనిని అందించానని చెప్పుకున్న కృతజ్ఞతా శీలి ఆయన .

ఇలా ప్రజా ఉద్యమాన్ని, ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని తన కవితాక్షరాలలో పొదిగి, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన మహాకవి దాశరథి! **"జ్వాలా లేఖిని"** కవితకు రాసిన ముందుమాటలో ఆయన చెప్పిన మాటలు ఆయన కవిత్వాన్ని, సాహిత్యాన్ని అధ్యయనం చేసిన ప్రతి ఒక్కరికి ఎంతో ఔచిత్యంగా అనిపిస్తాయి.

**"నా రచనలు నీళ్ల లాంటివి,
మహా మేధావుల రచనలు మధువు లాంటివి!
కానీ ప్రతివాడు నీళ్లు తాగుతాడు"!**

# మాయపట్నం ప్రజలకు తక్షణ సాయం చేయండి - కలెక్టర్ కు పవన్ ఆదేశం

అమరావతి, జులై 23: కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రాకాసి అలల ఉద్ధృతి కారణంగా మాయపట్నం గ్రామం జలమయం కావడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే స్పందించారు. మాయపట్నం గ్రామంలోని ప్రజలకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో పవన్ వర్చువల్ గా సమీక్ష నిర్వహించారు. అధికారులు అక్కడి ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ, మాయపట్నం వద్ద అలల తాకిడి తీవ్రంగా ఉండటంతో అనేక ఇళ్ళు నీట మునిగినట్లు తెలిపారు.

దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, వరద బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు అందించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా, వారికి ఆహారం, పాలు, మరియు మంచి నీరు తక్షణమే అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వైద్య సిబ్బందిని, ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

రానున్న రోజుల్లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గతంలో అక్కడి తీరంలో చేపట్టిన రక్షణ చర్యలు, నిర్మించిన రక్షణ గోడ, జియో ట్యూబ్ గురించి కూడా ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

# కోట విలక్షణ నటనకు కోటలాంటి వారు ప్రముఖుల నివాళులు



కోట శ్రీనివాస్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళా జనార్ధనమూర్తి, రామ సత్యనారాయణ, గుండవరపు హనుమంతరావు, దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు

హైదరాబాద్, జులై 23: కోట విలక్షణ నటనకు పెట్టని కోట లాంటి వారు అని ప్రముఖులు నివాళులు అర్పించారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో ఇటీవల మృతి చెందిన విఖ్యాత నటుడు కోట శ్రీనివాసరావు కు నివాళి సభ జరిగింది ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ కోట సినిమాలో సహజంగా ఆ పాత్ర స్వభావం లోకి ఇమిడి పోయే లక్షణం కల ప్రతిభాశాలి అన్నారు ఆయన తోటి కళా కారుల పట్ల సహృదయత కల వారు అని వివ రించారు చిత్ర పరిశ్రమలో దర్శకుడు దాసరి నారాయణరావు గతం లో ఆయన ధైర్యం ఇచ్చేవారు అలాగే కోట నటనకు దూరం ఇనా ఆయన ను చూసి నేర్చుకునే అవకాశం పోయింది అని అవేదన వ్యక్తం చేశారు ప్రముఖ నటుడు సుబ్బరాయ శర్మ మాట్లాడుతూ తాను ఎదిగి వచ్చిన నాటక రంగాన్ని విస్మరించనీ గొప్ప మనస్సు వున్న నటుడు కోట అన్నారు ఆయనలో సృజనాత్మక నటన మహా నటులు అమితాబ్ బచ్చన్ రాజ కుమార్ వంటి వారి ప్రశంసలు పొందింది అని చెప్పారు రంగస్థల సినీ ప్రముఖ నటుడు నిట్టల శ్రీ రామ మూర్తి మాట్లాడుతూ సినీ నటుడు గా ఎదిగినా కోట కు రంగస్థలం అంటే ప్రాణం అని ఆయన నటులు పట్ల చూపే అభిమానం మరువలేని దని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కోట పేరిట ప్రతి సంవత్సరం నాటక సంఘాల వారు వారం పాటు నాటక ప్రదర్శన చేస్తే గాన సభ లోని ఏదో ఆడిటోరియం ఉచితం గా ఇస్తామని ప్రకటించారు రచయిత దర్శకుడు హనుమంత రావు, నటుడు మాణిక్ నిర్మాతలు రామ సత్యనారాయణ,వీర శంకర్, నాటక కళాకారులు రాధా కృష్ణ తదితరులు తమ నివాళులు అర్పించారు









# ఏపిని ఎఐ, డేటా హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం-నారా లోకేష్



అమరావతి, జులై 23: డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ? ఆంధ్రప్రదేశ్ సదస్సులో ఆయన పాల్గొని, ఎఐ , డేటా సెంటర్లపై జరిగిన చర్చలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత అభివృద్ధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ)ని ఆదర్శంగా తీసుకుంటున్నామని, ప్రపంచంలోనే తొలిసారి ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన దేశం యుఏఈ అని లోకేశ్ గుర్తు చేశారు. యుఏఈ సహకారంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత అభివృద్ధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ)ని ఆదర్శంగా తీసుకుంటున్నామని, ప్రపంచంలోనే తొలిసారి ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన దేశం యుఏఈ అని లోకేశ్ గుర్తు చేశారు. యుఏఈ సహకారంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సదస్సులో లోకేశ్ క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపైనా మాట్లాడారు. దక్షిణాసియాలోనే మొట్టమొదటి 152 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను రాష్ట్ర రాజధాని అమరావతిలో జనవరి 2026లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ క్వాంటమ్ కంప్యూటర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంను డేటా సిటీగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, అంతర్జాతీయ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు.విద్యారంగంలో సమూల మార్పులపై దృష్టి సారిస్తున్నామని, ఎఐ , క్వాంటమ్ కంప్యూటింగ్‌ను కరిక్యులంలో చేర్చి, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నట్లు లోకేష్ తెలిపారు. రోజువారీ పరిపాలనలో ఎఐని వినియోగించి, ప్రజలకు సులభతరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 'మనమిత్ర' పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టి, 600 రకాల పౌర సేవలను వేగవంతంగా అందిస్తున్నామని, ఇందుకోసం వివిధ శాఖలను అనుసంధానిస్తూ భారీ డేటా లేక్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో జి42 ఇండియా సీఈఓ మను జైన్, ప్రైమస్ పార్టనర్స్ వైస్ ప్రెసిడెంట్ రక్ష శ్రద్ధ వ్యాఖ్యాతగా పాల్గొన్నారు. ఎఐ, డేటా సెంటర్లు, స్మార్ట్ గవర్నెన్స్ ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించే మార్గాలను అన్వేషిస్తామని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు.

# జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ గుదిబండి వెంకటరెడ్డి మృతి సాంస్కృతిక రంగం పెద్ద దిక్కు కోల్పోయింది



జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ స్థాపకుడు సాంస్కృతిక రంగ సారథిగా పేరు పొందిన గుదిబండి వెంకటరెడ్డి (85) సోమవారం తెల్లవారు ఝామున ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం రాత్రి గుంటూరు నుంచి బస్సులో తిరుగు ప్రయాణంలో నార్కెట్ పల్లి సమీపంలో బస్సు లారీని గుద్దడంతో బస్‌లో వున్న వెంకటరెడ్డి ఆయన సహచర సాంస్కృతిక రంగ ప్రముఖుడు శంకర్ ముందుకు పడిపోయారు. తలకు బలమైన గాయం వల్ల వెంకటరెడ్డి అక్కడికక్కడే మరణించారు. శంకర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఊహించని ఈ సంఘటన వల్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర సచివాలయంలో అంచెలంచలుగా ఎదిగిన గుదిబండి వెంకటరెడ్డి తనకు అత్యంత ఆప్తుడు అన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి పలువురు నృత్య సంగీత కళాకారులను టివి కళాకారులను ప్రోత్సహించిన వెంకటరెడ్డి మంచి సాహితీప్రియుడు అని ఆయన జన్మదినోత్సవం సందర్భంగా ఏదో అంశంపై కవిత సంకలనాలు వెలువరించే వారు అని గుర్తు చేశారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ వయసును అధిగమించి తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తూ గుదిబండి వెంకటరెడ్డి మృతి బాధాకరం అన్నారు. సాంస్కృతిక సంస్థలు ప్రతినిధులు రసమయి, రాము, వంశీ రామరాజు, కిన్నెర రఘురాం, అభినందన భవాని, రాగసప్తస్వరం రాజ్యలక్ష్మి, యువకళా వాహిని లంక లక్ష్మినారాయణ, ఆరాధన లోకం కృష్ణయ్య, కళా నిలయం సురేందర్ తదితర ప్రముఖులు మంచి కార్యకర్త ఆత్మీయుడును కోల్పోయామని అన్నారు. సాహితీకిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు కవులు పెద్దూరి వెంకటదాసు, మానస రఘుశ్రీ, రాఘవరెడ్డి మరెందరో తమ బాధ వ్యక్తం చేశారు.

త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి గానసభతో వెంకటరెడ్డికి ఎంతో అనుబంధం ఉందని ఆయన సంస్థ కార్యక్రమాలు ఎక్కువగా గానసభలో చేసే వారని తెలిపారు. పలువురు జర్నలిస్టులు సంతాపం తెలుపుతూ సాంస్కృతిక రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని తెలిపారు.

# 'మానవత్వం నిలుపుకో' సమీక్షా సమావేశం



పుస్తకావిష్కరణలో అతిథులు

మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చర్ సెంటర్‌లో రిటైర్డ్ ఉన్నతాదికారి వీడి రాజగోపాల్‌రచించిన **'మానవత్వం నిలుపుకో'** పుస్తకంపై సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో కవులు, రచయితలు తమ స్వీయ కవితలను వినిపించారు. వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని కవులను సన్మానించారు. గద్వాల సోమన్న రచించిన **'వల్లంకి పిట్ట'** పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాధాకుసుమ, సీఎల్ రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటస్వామి, గద్వాల సోమన్న తదితరులు పాల్గొన్నారు.









## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు**

అడ్మిన్:**రమాదేవి కులకర్ణి**
8985613123

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**



### అదుపులేని ఆగ్రహం

నింగిలో చుక్కలు మిణుకులు,
మనసులో కలవరాలు పొంగులు,
ఆనంద ఉత్సాహాలు తెల్లవారు,
ఆశలు ఊపిరిలో ఊగిసలాడు!.
ఎదురు చూస్తున్నావు, నవ్వులతో,
క్షణంలో అనుభూతులు కలవడమే,
నీలిమందిరంలో కలలు తేలాయి,
హృదయంలో సంగీతం మారుమ్రోగుతుంది.
ఆలోచనలు తేలికైన ఈదులతో,
విశ్వాసం సాగరం దాటింది,
భయాలు అడుగడుగునా కరిగిపోయాయి,
ఆశలు కొత్తగా మొలకెత్తాయి.
క్షణికావేశం కలిగించింది ఒక తీరు,
జ్ఞాపకాలలో మాత్రమే మిగిలిపోయింది,
అయినప్పటికీ, ఆ క్షణం మనసులో నిలిచిపోయింది,
ఆనందం, ఆశ, ప్రేమ? అన్నీ కలిసాయి!.

-డా.భరద్వాజ రావినూతల
కొత్తపట్నం

### అనర్థదాయకం

క్షణికావేశంలో ఎవరికైనా
కోపము మితి మీరిపోవును
ఆలోచన అతి తక్కువైపోయి
చేయరాని పని చేయుచుండును.
జీవితంపై విరక్తి కలిగినపుడు
ఆత్మహత్యకు సైతం పాల్పడును
విపరీత కోపమును ఇతరులపై
ప్రదర్శించుటకు అవకాశముండును.
హాలికుడు అప్పులెక్కువైనపుడు
జీవితంపై విరక్తి తెచ్చుకొనియే
ఆత్మహత్యకు పాల్పడినపుడు
తన ఉసురునే కోల్పోవుచుండును.
క్షణికావేశంలో తనవారు పరవారు
అను విచక్షణ కూడ మరచును
తానేమి చేయుచున్నాడో యని
తనకే తెలియకుండ ప్రవర్తించును
క్షణికావేశంలో చేసిన పని గురించి
తరువాత పశ్చాతాపం చెందును
కాని జరిగిపోయిన దానిని తిరిగి
సరిచేయుట ఎంతో కష్టమగును.

-అక్కి నర్సింలు గౌడ్
9912659965

### ఒక క్షణం యోచించు

ఆవేశం వేదనకు నాందీవాచకం
అనాలోచనతో వేడెక్కు మస్తకం
అంతరించి పోవును నీలో వివేకం
క్షణికావేశం జీవన చరమాంకం
అర్ధాంతరంగా
బతుకు కూలు విఠల!.
దురాశ పేరాశల పర్యవసానం
కూల్చేయును నిన్నుదుర్వ్యసనం
నిరాశతో మధ్యంతర మరణం
ధైర్యం సాయంతో చేయాలి రణం
స్థైర్యమే క్షణికావేశానికి మందు
విఠల!.
పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపితే
యువకుల్లో నమ్మకం పెంపొందితే
కుటుంబంలో సామరస్యం విరిసితే
సమాజంలో సౌభ్రాతృత్వం పెరిగితే
క్షణికావేశానికి తావుండదు విఠల!.
కోపతాపాలను నియంత్రించుకో
ఈర్ష్యా ద్వేషాలను అణుచుకో
వివేచన విచక్షణలు పెంచుకో
అసూయ భ్రమలను వదులుకో
ఆవేశంలో ఒక క్షణం
యోచించు విఠల!.

-కాటేగారు పాండురంగ విఠల్

### తొందరపాటు నిర్ణయం

అలుకలు, అపార్థాలు
ఆవేశకావేషాలు
అనాలోచిత చర్యలు
ఎందుకీ తొందరపాటు నిర్ణయాలు
బ్రహ్మ ప్రసాదించిన చక్కని జన్మకు
రాసిన తలరాతను మార్చుకుని
తమ మనుగడను
చితి పేర్చుకుంటున్నారు.
ప్రేమలంటారు, ఆపై పెళ్ళంటారు
అంతలోనే గొడవలు పడతారు
అది ప్రేమా, వ్యామోహమా
ఏమనుకోవాలి.
చదువులలో ఫెయిలైతే
అవమానంతో ఆత్మహత్యలు
చేసుకోవడాలు
ముందే చక్కగ చదువుకుని
పట్టుదలతో విజయం
సాధించవచ్చుగా
నేటితరం యువతరానికి
ఈ జాడ్యం మరీ ఎక్కువై
సమాజంలో విపరీత
ధోరణులుగా మారుతోంది.
క్షణికావేశంతో తీసుకునే
నిర్ణయాలు
కన్నవారి కడుపున చిచ్చు
రగులుస్తున్నాయి
ఆ కన్నవారి కన్నీటి సంద్రాలు
ఆ చితిమంటలార్పేనా
ఆ కడుపుకోతకు పడిన
గాయాలు మానేనా

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.